B9 NEWS
నిజం - మా ఇజం

మన.. ప్రజా పక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం...



PUBLISHED FROM: Telangana & Andhrapradesh | సంపుటి : 01 | సంచిక : 272 | శనివారం | 31-10-2026 | ఎడిటర్ : పులిజ్వాల చంద్రకాంత్ | పేజీలు : 08 | వెల : 05/-



2

మూసీ ప్రక్షాళనకు మేము

వ్యతిరేకం కాదు

రాంచందర్ రావు

- గాంధీ సరోవరం పేరిట పేదల ఇళ్లు కూల్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్న రాంచందర్ రావు
- కాంగ్రెస్ పార్టీ తమపై తప్పుడు ప్రచారం చేస్తోందని ఆరోపణ
- విపక్షాల 'మాక్ పార్లమెంట్' ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని విమర్శ

మన ప్రజాపక్షం,హైదరాబాద్

మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టును బీజేపీ అడ్డుకుంటోందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనను తమ పార్టీ వ్యతిరేకించడం లేదని, అయితే 'గాంధీ సరోవరం' పేరిట పేదల ఇళ్లను కూల్చివేయడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాంచందర్ రావు

2 చట్టం మౌనంగా ఉన్నప్పుడు రాజ్యాంగమే మార్గదర్శకం: జస్టిస్ సూర్యకాంత్

1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములను కాపాడాం



2

- మియాపూర్‌లో 550 ఎకరాలపై సుప్రీంకోర్టు తీర్పు
- భూముల విలువ రూ.50 వేల కోట్లు అని సీఎం వెల్లడి
- రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ భూములు కాపాడినట్లు ప్రకటన
- కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై భూ ఆక్రమణ ఆరోపణలు
- భూముల విక్రయ నిధులతో అభివృద్ధి పనుల ప్రతిపాదన

మన ప్రజాపక్షం,ఢిల్లీ

మియాపూర్‌లో 550 ఎకరాల భూమిపై సుప్రీంకోర్టు తీర్పు తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగా రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ భూముల పరిరక్షణ, గతంలో జరిగిన భూ లావాదేవీలపై మాట్లాడారు. రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడినట్లు తెలిపారు. మియాపూర్ భూముల విలువ సుమారు రూ. 50 వేల కోట్లు ఉంటుందని పేర్కొన్నారు.మియాపూర్ భూముల వ్యవహారంలో మాజీ సీఎం కేసీఆర్, ఆయన బంధువు దామోదర్‌రావు, గోల్డ్‌స్టోన్ ప్రసాద్‌పై రేవంత్‌రెడ్డి ఆరోపణలు చేశారు. ఈ భూ లావాదేవీల్లో లగ్జరీ కార్లు లంచంగా ఇచ్చారని, నగదు రూపంలో ముడుపులు అందాయని ఆరోపించారు. తాను ఎమ్మెల్యేగా, ఎంపీగా, టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచే ఈ వ్యవహారంపై పోరాడుతున్నట్లు చెప్పారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో మియాపూర్ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.ఐఎంజీ భూములు, కంచ గచ్చిబౌలి, మామిడిపల్లి, గుర్రంగూడ అటవీ భూములు,



ఏపీకి నేడు కేంద్ర బృందం..

తుపాను నష్టంపై క్షేత్రస్థాయి పరిశీలన

- అర్నబ్ తుపాను నష్టం అంచనాకు ఏపీకి కేంద్ర బృందం
- శని, ఆదివారాల్లో ప్రభావిత జిల్లాల్లో అధికారుల పర్యటన
- సోమవారం నుంచి కరవు పరిస్థితులపై మరో బృందం అధ్యయనం
- రెండు బృందాలుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పరిశీలన
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానున్న అధికారులు

2

మన ప్రజాపక్షం,ఏపీ

అర్నబ్ తుపాను కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన నష్టాన్ని అంచనా వేసేందుకు, అదే సమయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నెలకొన్న కరవు పరిస్థితులను పరిశీలించేందుకు రెండు వేర్వేరు కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నాయి. ఈ విషయాన్ని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఎస్ఈఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ శుక్రవారం వెల్లడించారు.కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల కేంద్ర

హైస్పీడ్ రైళ్లే పనులు వేగవంతం చేయాలి

రైల్వేశాఖ మంత్రిని కోరిన సీఎం రేవంత్ రెడ్డి

మన ప్రజాపక్షం,ఢిల్లీ



2

తెలంగాణకు ప్రకటించిన హైస్పీడ్ రైళ్ల పనులు వేగవంతం చేయాలని రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ – పుణె, హైదరాబాద్ – బెంగళూరు, హైదరాబాద్ – చెన్నై కారిడార్ల కోసం కేంద్ర ప్రభుత్వ ప్రతిపాదనలకు కొన్ని మార్పుల్ను సూచిస్తూ పంపినట్లు సీఎం వివరించారు. కేంద్ర ప్రభుత్వం అలైన్‌మెంట్ ఆమోదిస్తే భూ సేకరణను ప్రారంభిస్తామని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాధ్యమైనంత త్వరగా అలైన్‌మెంట్ ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. దిల్లీ రైలు భవన్‌లో రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రానికి

సొంత సంస్థల్లా వాడుకుంది..

బ్యాంకులను కాంగ్రెస్ సొంత సంస్థల్లా వాడుకుంది..

- ఐడీబీఐ వాటాల విక్రయాన్ని సమర్థించిన నిర్మలా సీతారామన్
- కాంగ్రెస్ హయాంలో రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపణ
- మొండి బకాయిలపై గత ప్రభుత్వాలను విమర్శించిన మంత్రి
- రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం చేశామని వెల్లడి
- విక్రయ ప్రక్రియలో నిబంధనలు పాటించామని స్పష్టీకరణ

2



మన ప్రజాపక్షం,ఢిల్లీ

ఐడీబీఐ బ్యాంకులో మెజారిటీ వాటా విక్రయించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించారు. ఈ విక్రయంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన విమర్శలకు ఆమె స్పందించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులపై రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి, నిబంధనలకు విరుద్ధంగా రుణాలు ఇప్పించాయని ఆరోపించారు. వాటి ఫలితంగానే ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో భారీగా మొండి బకాయిలు పేరుకుపోయాయని విమర్శించారు.బ్యాంకులు, ఆర్థిక సంస్థలను కాంగ్రెస్ నేతలు తమ సొంత

హైదరాబాద్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఆకాశ్

ఖరారు చేసిన కల్వకుంట్ల కవిత

- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో తెలంగాణ రక్షణ సేన
- హైదరాబాద్ అభ్యర్థిగా సీనియర్ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు ఖరారు
- వరంగల్, హైదరాబాద్ రెండు స్థానాల్లోనూ బీసీలకే అవకాశం
- ఎన్నికల పరిశీలకుడిగా డాక్టర్ చిట్నేని రఘు నియామకం

మన ప్రజాపక్షం,హైదరాబాద్



2

రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధినేత్రి కల్వకుంట్ల కవిత తమ పార్టీ అభ్యర్థులను ఖరారు చేశారు. హైదరాబాద్

ఉద్యోగానికే రిటైర్మెంట్,సమాజ సేవకు కాదు

- ఎంఈఓ మంజులాదేవి పదవీ విరమణ సభలో కోదండరాం వ్యాఖ్యలు
- మంజులాదేవి లాంటి వారికి అసలు విరమణ ఉండదన్న ప్రొఫెసర్
- సభకు హాజరైన ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే, ఇతర ప్రముఖులు

మన ప్రజాపక్షం,హైదరాబాద్



2

ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ అనేది కేవలం ఉద్యోగానికి మాత్రమే పరిమితమని, సమాజ సేవకు ఎలాంటి విరమణ ఉండదని ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం స్పష్టం చేశారు. కొందరు ఉద్యోగులు కేవలం తమ విధులకు మాత్రమే పరిమితమవుతారని,

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్

2

పనిలేక తిరుగుతున్నానా?..

రేవంత్ సర్కార్‌ను కూల్చేదాకా ఆగను: ఈటల రాజేందర్

- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ తరలింపు కోసం ఈటల పాదయాత్ర
- ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర ఆగదని హెచ్చరిక
- నిధులు తేలేకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్
- డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేయాలని డిమాండ్
- డంపింగ్ యార్డ్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందని ఆవేదన

2



మన ప్రజాపక్షం,హైదరాబాద్

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలనే డిమాండ్‌తో బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్ర ఉద్రిక్తంగా సాగుతోంది. ఈ క్రమంలో ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేంతవరకే కాదు, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే వరకు తన యాత్ర

All are Continues Second Page

మూసీ ప్రక్షాళనకు మేము

వ్యతిరేకం కాదు

మొదటి పేజీ తరువాయి

మాట్లాడారు. పేదల ఇళ్లకు ఎలాంటి నష్టం జరగకుండా మూసీని శుభ్రపరిచే ప్రణాళికలు ప్రభుత్వం సిద్ధం చేయాలని సూచించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇవ్వడానికి నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం, మూసీ ప్రక్షాళన పేరుతో వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధమవ్వడం విచిత్రంగా ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు ఇంత పెద్ద మొత్తంలో నిధులు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు.ఢిల్లీలో విపక్షాలు తలపెట్టిన 'మాక్ పార్లమెంట్'పైనా రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో యూపీఏ హయాంలో ములాయం సింగ్ యాదవ్ నాయకత్వంలో మాక్ పార్లమెంట్ నిర్వహిస్తే, దాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారని సోనియా గాంధీ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌ను ప్రజాస్వామ్య దేవాలయంగా అభివర్ణించిన కాంగ్రెస్ నేత, మాజీ స్పీకర్ మీరా కుమార్ విషయాన్ని ప్రస్తావిస్తూ... ఇప్పుడు అదే కాంగ్రెస్ నేతలు రాజకీయ స్వలాభం కోసం ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

పనిలేక తిరుగుతున్నానా?..

మొదటి పేజీ తరువాయి

ఆగదని ఆయన హెచ్చరించారు.పనిలేక తిరుగుతున్నానంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న విమర్శలపై ఈటల ఘాటుగా స్పందించారు. "డంపింగ్ యార్డ్ తొలగింపు కోసం నేను పాదయాత్ర చేస్తుంటే, ఈటల రాజేందర్‌కు పనిలేక తిరుగుతున్నాడని కాంగ్రెస్ నేతలు అంటున్నారు. కేవలం డంపింగ్ యార్డ్ తరలించేదాకా మాత్రమే కాదు.. మీ ప్రభుత్వం కూలిపోయే వరకు నేను తిరుగుతూనే ఉంటా" అని ఆయన స్పష్టం చేశారు.జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ రీసైక్లింగ్ కోసం అయ్యే ఖర్చుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయాలని ఈటల డిమాండ్ చేశారు. నివేదిక ఇస్తే, ప్రధానమంత్రి మోదీని ఒప్పించి అవసరమైన నిధులను తానే తీసుకొస్తానని ప్రకటించారు. ఒకవేళ తాను నిధులు తీసుకురావడంలో విఫలమైతే, రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ విసిరారు.అక్టోబర్ 27న ఏదులాబాద్‌లోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఈటల తన పాదయాత్రను ప్రారంభించారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల పరిసర గ్రామాలు, కాలనీల్లోని ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటోందని, గాలి, భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయని, తక్షణమే దాన్ని తరలించాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.



హైదరాబాద్ ఎమ్మెల్సీ

అభ్యర్థిగా ఆకాశ్

మొదటి పేజీ తరువాయి



– రంగారెడ్డి – మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పార్టీ అభ్యర్థిగా ప్రముఖ జర్నలిస్ట్ ఆకాశ్ కొల్లూరు పేరును ప్రకటించారు.సుమారు 20 ఏళ్లుగా జాతీయ మీడియా రంగంలో పనిచేస్తున్న ఆకాశ్ కొల్లూరు... ఇండియాటుడే, రిపబ్లిక్ టీవీ, సీఎన్ఎన్ న్యూస్ 18, డైలీ హంట్ వంటి సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో పాఠశాల విద్యను, ఉస్మానియా యూనివర్సిటీ నుంచి గోల్డ్ మెడల్‌తో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. విద్యావంతుడు, జాతీయ మీడియా అనుభవం ఉన్న బీసీ నేత కావడంతో పట్టభద్రుల మద్దతు తమకే లభిస్తుందని టీఆర్ఎస్ ధీమా వ్యక్తం చేస్తోంది.ఇప్పటికే వరంగల్ – ఖమ్మం – నల్గొండ స్థానం నుంచి బీసీ వర్గానికి చెందిన నలమాస శ్రీకాంత్ గౌడ్‌ను టీఆర్ఎస్ బరిలో దింపిన సంగతి తెలిసిందే. తాజా ప్రకటనతో రెండు ఎమ్మెల్సీ స్థానాల్లోనూ బీసీలనే నిలబెట్టినట్లయింది. ఈ ఎన్నికల కోసం హైదరాబాద్ స్థానానికి అబ్జర్వర్‌గా డాక్టర్ చిట్నేని రఘును... రెండు నియోజకవర్గాల ఎన్నికల వ్యూహాలు, వార్ రూమ్ ఇన్‌చార్జ్‌గా న్యాయవాది రామ్ కల్యాణ్ చల్లాను నియమిస్తూ కవిత నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాం

మొదటి పేజీ తరువాయి

మంచిరేవులలోని 143 ఎకరాలు సహా పలు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను కాపాడినట్లు సీఎం వివరించారు. ఈ వ్యవహారాల్లో కేటీఆర్, బీఆర్ఎస్ నేతల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 400 ఎకరాల అటవీ భూమి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భూముల అంశాలనూ ప్రస్తావించారు. పద్మాలయ స్టూడియోస్, లాంకో భూముల కేసులను అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు పరిష్కరించలేదని కేసీఆర్, హరీశ్‌రావును ప్రశ్నించారు. హరీశ్‌రావు మామ హన్మంతరావుపై కూడా ప్రభుత్వ భూమి ఆక్రమణ ఆరోపణలు చేశారు. ఇవన్నీ ముఖ్యమంత్రి చేసిన ఆరోపణలే.ప్రభుత్వ భూములను విక్రయించి వచ్చిన నిధులను విద్య, సాగునీరు, వైద్యం, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించే ఆలోచనలో ఉన్నట్లు రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. వనరుల సమీకరణ కోసం ఏర్పాటు చేసిన మంత్రివర్గ ఉపసంఘం భూముల విక్రయ ప్రతిపాదనలను పరిశీలించి, ఆ నిధులతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తిస్తుందని తెలిపారు. మియాపూర్ తీర్పుపై కేసీఆర్, కేటీఆర్ స్పందించాలని, అసెంబ్లీ వేదికగా బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు.

సొంత సంస్థల్లా వాడుకుంది..

మొదటి పేజీ తరువాయి

సంస్థల్లా వాడుకున్నారని నిర్మలా సీతారామన్ ఎక్స్‌లో పేర్కొన్నారు. తమకు నచ్చిన సంస్థలకు రుణాలు ఇవ్వాలని బ్యాంకు ఉద్యోగులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపించారు. 1976లో ఇందిరా గాంధీ ప్రభుత్వం.. సంజయ్ గాంధీ వర్గానికి సంబంధమున్న సంస్థకు రుణాల విషయంలో రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గని ఎస్‌బీఐ ఛైర్మన్ ఆర్.కె. తల్వార్‌ను పదవి నుంచి తొలగించిందని గుర్తుచేశారు. మారుతి సంస్థకు రుణాల విషయంలోనూ 'సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'పై సంజయ్ గాంధీ ఒత్తిడి తెచ్చారని ఆమె ఆరోపించారు.ఐడీబీఐ బ్యాంక్ గతంలో తీవ్ర సమస్యల్లో కూరుకుపోయిందని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు. వీడియోకాన్, విన్‌సమ్, ఏబీజీ షిప్‌యార్డ్, కింగ్‌ఫిషర్ వంటి పెద్ద సంస్థలకు ఇచ్చిన రుణాలు మొండి బకాయిలుగా మారి బ్యాంకుకు భారీ నష్టాలు తెచ్చాయని తెలిపారు. ఈ సంస్థలకు కాంగ్రెస్ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం వృత్తిపరమైన నిర్వహణ, జాగ్రత్తతో కూడిన రుణ విధానాలు, రూ.25 వేల కోట్లకు పైగా మూలధన సాయం ద్వారా బ్యాంకును తిరిగి గాడిలో పెట్టిందని చెప్పారు. ఐడీబీఐ పునర్వ్యవస్థీకరణలో అన్ని నిబంధనలను పాటించామని స్పష్టం చేశారు.2024 ఫిబ్రవరిలో కేంద్రం విడుదల చేసిన భారత ఆర్థిక వ్యవస్థపై శ్వేతపత్రంలో గత ప్రభుత్వాల హయాంలో చోటుచేసుకున్న ఆర్థిక అవకతవకల వివరాలు ఉన్నాయని నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ హయాంలో.. పలుకుబడి ఉన్నవారికి ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా బ్యాంకింగ్ సేవలు అందేవని విమర్శించారు.ఈ నెల 14న ఐడీబీఐ బ్యాంకులో 60.72 శాతం వాటాను కెనడాకు చెందిన ఫెయిర్‌ఫాక్స్ ఫైనాన్షియల్ హోల్డింగ్స్‌కు సుమారు రూ.53 వేల కోట్లకు విక్రయించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది భారత బ్యాంకింగ్ రంగంలో అతిపెద్ద విదేశీ పెట్టుబడిగా నిలవనుంది. ఈ నిర్ణయాన్ని రాహుల్ గాంధీ విమర్శిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వాలు బ్యాంకులను ఏర్పాటు చేస్తే, మోదీ ప్రభుత్వం వాటిని విక్రయిస్తోందని వ్యాఖ్యానించారు. ఐడీబీఐ ఉద్యోగులకు అండగా ఉంటానని ఆయన తెలిపారు.

హైదరాబాద్‌ను ముంచెత్తిన భారీ వర్షం

మొదటి పేజీ తరువాయి

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావం హైదరాబాద్ నగరంపై పడింది. మధ్యాహ్నం వరకు మామూలుగానే ఉన్నా, సాయంత్రం 5 గంటల నుంచి దట్టమైన మబ్బులు కమ్ముకొని ఉరుములు, మెరుపులతో నగరమంతటా వర్షం కురిసింది. చాలారోజుల తరువాత కురిసిన ఈ వర్షం నగరవాసులను ఇబ్బందులు పెట్టింది. గాలివానకు విద్యుత్ నిలిచిపోవడంతో పాటు రహదారులపై నీరు చేరి వాహనదారులకు నరకం చూపించింది.భాగ్యనగరంలో సాధారణంగానే సాయంత్ర వేళ ఆఫీసులు, స్కూళ్లు, కాలేజీలు వదిలే సమయం కావడంతో మామూలుగానే రోడ్లు కిక్కిరిసి ఉంటాయి. దానికి తోడు ఈదురుగాలులు, వర్షం తోడవటంతో వాహనదారుల కష్టాలు రెట్టింపయ్యాయి. ముందుగా కాప్రా పరిధిలో మొదలైన వర్షం క్షణాల్లోనే నగరమంతటా విస్తరించింది. భారీ గాలులు, ఉరుములు, మెరుపులతో చాలా ప్రాంతాల్లో నగరవాసులను భయాందోళనలకు గురి చేసింది. బహదూర్‌పురాలో అత్యధికంగా 8.5 సెం.మీ వర్షపాతం నమోదైంది. మాదాపూర్‌లో 7.13 సెం.మీ, జూబ్లీహిల్స్‌లో6.03 మిల్లీమీటర్లు, చార్మినార్‌లో 5.58 సెం.మీ, కూకట్?పల్లిలో 5.53 సెం.మీ వర్షపాతం నమోదైంది.

హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో భారీ వర్షం

శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ఒక్కసారిగా కురిసిన వర్షానికి జనాలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఐటీ హబ్ అయిన మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం పరిసర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షం వల్ల రహదారులపైకి నీరు చేరడంతో వాహనాలు చాలా నెమ్మదిగా కదులుతున్నాయి.

ఏపీకి నేడు కేంద్ర బృందం..

మొదటి పేజీ తరువాయి

బృందం శని, ఆదివారాల్లో (అక్టోబర్ 31, నవంబర్ 1) తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తుంది. రియల్-టైమ్ గవర్నెన్స్ సెంటర్‌లో తుపాను సమయంలో తీసుకున్న చర్యలు, నష్టంపై అధికారులు కేంద్ర బృందానికి వివరించనున్నారు. అనంతరం ఈ బృందం రెండుగా విడిపోయి క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. ఒక బృందం కోనసీమ, కాకినాడ జిల్లాల్లో, రెండో బృందం తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో నష్టాన్ని పరిశీలిస్తుంది. ఈ బృందం సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానుంది.ఇదిలా ఉండగా, 2026 ఖరీఫ్ సీజన్‌లో నెలకొన్న కరవు పరిస్థితులను అంచనా వేసేందుకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ చిన్మయ్ గోట్మారే నేతృత్వంలోని మరో బృందం నవంబర్ 2, 3 తేదీల్లో రాష్ట్రంలో పర్యటిస్తుంది. పది మంది సభ్యులున్న ఈ బృందం రెండుగా విడిపోయి శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పర్యటించి రైతులు, అధికారులతో మాట్లాడనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 283 మండలాలను తీవ్ర కరవు, 105 మండలాలను మధ్యస్థ కరవు ప్రాంతాలుగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ బృందం నవంబర్ 4న ముఖ్యమంత్రితో భేటీ కానుంది.తుఫాను నష్టం అంచనా బృందం సభ్యులు: చిత్తరంజన్ దాస్ (జాయింట్ సెక్రటరీ, హోంశాఖ), ప్రశాంత్ ఆర్మోరికర్ (వ్యవసాయ శాఖ), రేఖారాణి కొల్లు (జలశక్తి మంత్రిత్వ శాఖ), హిమాలయ గర్గ్ (ఆర్థిక శాఖ), రాకేశ్ కుమార్ సింగ్ (రోడ్డు రవాణా), అలోక్ జవహర్ (గ్రామీణాభివృద్ధి), ప్రణయ్ గర్గ్ (విద్యుత్ శాఖ), డా. ఎస్.వి.ఎస్.పి. శర్మ (ఇస్రో).కరవు అధ్యయన బృందం సభ్యులు: చిన్మయ్ గోట్మారే (జాయింట్ సెక్రటరీ, వ్యవసాయ శాఖ), ప్రభా కాంతి, వినోద్ సమంత్ (గ్రామీణాభివృద్ధి), పంకజ్ పహాడియా (ఆర్థిక శాఖ), ఎన్.వి. సతీష్ శేమకుర్తి (డైరెక్టరేట్ ఆఫ్ మానిటరింగ్), డా. కె. పొన్నుసామి (నూనె గింజల అభివృద్ధి), అనురాధ బటానా (నీతి ఆయోగ్), ధీరేంద్ర కుమార్, ప్రదీప్ కుమార్ (ప్రజా పంపిణీ), డా. సాక్షి భదౌరియా (పశుసంవర్ధక శాఖ).

ఉద్యోగానికే రిటైర్మెంట్,

సమాజ సేవకు కాదు

మొదటి పేజీ తరువాయి

అలాంటి వారికి పదవీ విరమణ వర్తించవచ్చని అన్నారు. కానీ, కొందరు ఉద్యోగ బాధ్యతలతో పాటు పలు రంగాల్లో సమాజ సేవలోనూ చురుకుగా పాల్గొంటారని, అలాంటి వారికి నిజమైన విరమణ ఉండదని చెప్పారు.జడ్చర్లలో నిర్వహించిన ఎంఈఓ మంజులాదేవి పదవీ విరమణ సన్మాన సభలో కోదండరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. మంజులాదేవి వంటి వారికి పదవీ విరమణ ఉండదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, ఎమ్మెల్సీ కేపీఎన్ రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఎ. శేఖర్, ప్రతాప్ రెడ్డి, ఆర్జేడీ సోమిరెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు కూడా పాల్గొని మంజులాదేవికి శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు.

హైస్పీడ్ రైళ్లే పనులు వేగవంతం చేయాలి

మొదటి పేజీ తరువాయి

సంబంధించిన ప్రాజెక్టులపై చర్చించారు.

నూతన రైలు మార్గం మంజూరు చేయండి

వికారాబాద్ – కృష్ణా కొత్త రైలు మార్గాన్ని వెంటనే మంజూరు చేయాలని రైల్వేశాఖ మంత్రిని రేవంత్ రెడ్డి కోరారు. వికారాబాద్ జిల్లా టేకల్‌కోడ్ పరిసరాల్లో భారీ సున్నపురాయి నిక్షేపాలు బయటపడ్డాయని తెలిపిన సీఎం ఈ ప్రాంతాన్ని సిమెంట్, టెక్స్‌టైల్ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వివరించారు. ఆర్ఆర్ఆర్ చుట్టూ రీజినల్ రింగ్ రైలును అలైన్‌మెంట్ చేయాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. రీజినల్ రింగు రైలుతో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు.

బైపాస్‌లైన్ మార్గాలు ఏర్పాటు చేయాలి

డోర్నకల్– గద్వాల్, కల్వకుర్తి – మాచర్ల, కాచిగూడ కాచిగూడ –జగ్గయ్యపేట, పటాన్‌చెరు – ఆదిలాబాద్, బోధన్ – లాతూర్, అక్కన్నపేట బైపాస్ లైన్ మార్గాలను వెంటనే మంజూరు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను రేవంత్ రెడ్డి కోరారు. దక్షిణ మధ్య రైల్వే ఏర్పాటు చేయనున్న మెగా కోచింగ్, ఫ్రైట్ మెయింటెనెన్స్ డిపోను మహబూబాబాద్ సమీప అనంతారం గ్రామంలో ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి కోరారు.ఈ డిపో ఏర్పాటుకు అవసరమైన 409.1 ఎకరాల భూమిని రైల్వే శాఖకు అప్పగించేందుకు ఇప్పటికే అంగీకరించిన విషయాన్ని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం రేవంత్ తీసుకెళ్లారు. సమావేశంలో మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ కుమార్ యాదవ్, ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహమ్మద్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ అద్వైత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

చట్టం మౌనంగా ఉన్నప్పుడు రాజ్యాంగమే మార్గదర్శకం: జస్టిస్ సూర్యకాంత్

మొదటి పేజీ తరువాయి

సాంకేతికత మారినంత మాత్రాన రాజ్యాంగం ప్రజలకు కల్పించే గౌరవం, స్వేచ్ఛ, సమానత్వం మారబోవని భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ స్పష్టం చేశారు. సాంకేతికత వేగంగా మారుతున్న ఈ యుగంలో చట్టం మౌనంగా ఉన్నప్పుడు రాజ్యాంగమే న్యాయవ్యవస్థకు మార్గదర్శకం కావాలని సీజేఐ వ్యాఖ్యానించారు. పదేళ్ల క్రితం కలలో కూడా ఊహించని సవాళ్లు ఇప్పుడు న్యాయవ్యవస్థ ముందుకు వస్తున్నాయని దిల్లీ హైకోర్టు 60 వసంతాల వేడుకల్లో పాల్గొన్న సందర్భంగా ఆయన అన్నారు. ఏఐ రూపొందించిన వాటికి కాపీరైట్ రక్షణ ఇవ్వొచ్చా? డీప్‌ఫేక్స్‌ను చట్టం ఎలా ఎదుర్కోవాలి? వ్యక్తుల హక్కులకు భంగం కలగకుండా ఆవిష్కరణలను ఎలా ప్రోత్సహించాలి? లాంటి కొత్త ప్రశ్నలకు చట్టాల పుస్తకాల్లో సమాధానాలు దొరకడం కష్టమన్నారు. అలాంటి సవాళ్లకు రాజ్యాంగాన్ని దిక్సూచిగా తీసుకుని సమాధానాలు వెతకాలని సూచించారు. మరోవైపు ఇతర హైకోర్టులతో పోలిస్తే సుప్రీంకోర్టుపై ఉన్న భారాన్ని దిల్లీ హైకోర్టు చాలా వరకు తగ్గిస్తోందని సీజేఐ ప్రశంసించారు. సివిల్, వాణిజ్య వివాదాలను నేరుగా విచారించడంలో, మేధో సంపత్తి కేసుల పరిష్కారంలో ఈ న్యాయస్థానం అద్భుతమైన గుర్తింపు తెచ్చుకుందని అభినందించారు.



జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం

నాగర్ కర్నూల్, మన ప్రజాపక్షం:
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు తూడుకుర్తి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు సురక్షిత్ బచ్పన్ అభియాన్–ఏ పాన్ ఇండియా స్కూల్ అవేర్నెస్ క్యాంపెయిన్ గురించి విద్యార్థులకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిస్టిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ నిహారిక హాజరై మాట్లాడుతూ సురక్షిత్ బచ్పన్ అభియాన్ అనేది భారతదేశంలో పిల్లల రక్షణ, హక్కులు మరియు వారి భద్రతను పెంపొందించడం కోసం ఉద్దేశించిన ఒక ముఖ్యమైన కార్యక్రమం అన్నారు. చిన్న పిల్లలపై జరిగే లైంగిక దాడులు, వేధింపులను అడ్డుకోవడం కోసం ఏర్పాటైన పోక్సో చట్టంపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ప్రతి బిడ్డకు స్వేచ్ఛగా చదువుకునే, ఆడుకునే సురక్షితమైన వాతావరణాన్ని అందించడం అదేవిదంగా విద్యార్థులకు బాల్య వివాహాలు, సైబర్ నేరాల గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా బాలల రక్షణకు సంబంధించి విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించి, బాలల రక్షణకు సంబంధించిన పోస్టర్స్ ను ఆవిష్కరించడం జరిగింది.ఈ సందర్భంగా సురక్షిత బచ్పన్ గురించి అవగాహన కొరకు గ్రామంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీరామ్ ఆర్య గవర్నమెంట్ లాయర్, సుదర్శన్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు సత్యనారాయణ,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



జెడ్పిటిసి కూటమి అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారం

పొదలకూరు,మన ప్రజాపక్షం:
మరుపూరు గ్రామంలో జెడ్పిటిసి కూటమి అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం. చేసిన అభివృద్ధిని వివరిస్తూ మరుపూరు గ్రామం ఎంపీటీసీ అభ్యర్థి బిరదవోలు గౌరీని, జెడ్పిటిసి అభ్యర్థి కలిచేటి ప్రభాకర్ రెడ్డి సైకిల్ గుర్తు మీద ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. మరుపూరులో ప్రచారంలో భాగంగా బిరదవోలు గౌరీ, కలిచేటి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆశీస్సులతో మాకు ఈ అవకాశం దక్కిందని,సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మరుపూరు గ్రామానికి ఎనలేని సేవ చేశారని సోమిరెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో 1998లో ఏడెకరాల 32 సెంట్లు భూమి ఇపించి, 40 ఇళ్లు నిర్మించడం, సిమెంట్ రోడ్లు వేయడం, చెరువు కట్టలు మరమ్మతులు చేయడం, పార్టీలకు అతీతంగా పింఛన్ల కార్యక్రమం 4000,6000, 10000 మంచానికి పరిమితం అయినా వాళ్ళకి 15000, పింఛను అందిస్తున్నారని, వివరించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు గమనించి పొదలకూరు మండల ప్రజలందరు, ఒక్క జెడ్పిటిసి,19 ఎంపీటీసీలను, సైకిల్ గుర్తు మీద ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించి సోమిరెడ్డికి కానుకగా ఇవ్వాలని కోరారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



దీపావళికి టపాకాయల విక్రయదారులు తప్పనిసరిగా అనుమతులు పొందాలి

జనగామ మున్సిపల్ కమిషనర్

జనగామ,మన ప్రజాపక్షం
:రాబోయే దీపావళి పండుగ సందర్భంగా పట్టణంలో బాణసంచా/టపాకాయలు విక్రయించదలచిన వ్యాపారస్తులందరూ తప్పనిసరిగా జనగామ మున్సిపాలిటీ నుంచి ముందస్తుగా ట్రేడ్ లైసెన్స్ మరియు విక్రయ అనుమతులు పొందాలని మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వ్యాపారులు వెంటనే జనగామ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, ఫైర్ డిపార్ట్మెంట్ జారీ చేసిన నిరభ్యంతర ధృవీకరణ పత్రంతో పాటు అవసరమైన ఇతర పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.మున్సిపల్ అధికారులు పరిశీలించిన అనంతరం జారీ చేసే లైసెన్స్ పొందిన తర్వాతే నిబంధనల ప్రకారం టపాకాయల విక్రయాలు చేపట్టాల్సి ఉంటుందని తెలిపారు.పట్టణ ప్రజల ప్రాణ, ఆస్తి భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్క వ్యాపారి ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని కమిషనర్ కోరారు.అనుమతులు లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ, సురక్షితమైన వాతావరణంలో పండుగ నిర్వహణకు మున్సిపాలిటీకి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రతి గ్రామపంచాయతీలో రోజుకు 50 మంది కూలీలకు ఉపాధి కల్పించాలి

సాగునీటి కాలువల్లో పూడిక, జమ్ము తొలగింపునకు ప్రాధాన్యత
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్ కర్నూల్ జిల్లాలోని ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ ద్వారా ప్రతిరోజూ కనీసం 50 మంది కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు నిరంతర ఉపాధి కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి దోహదపడే పనులను గుర్తించి ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు కలెక్టర్ దేవ సహాయం, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ చిన్న ఓబులేసుతో కలిసి ఎంపీడీవోలు, ఎంపీఓలు, ఏపీవోలు, ఈసీలు, ఏపీఎంలు, వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లావ్యాప్తంగా ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనుల ఎంపిక, పనుల పురోగతి, కూలీలకు ఉపాధి కల్పన, గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై మండలాల వారీగా సమగ్రంగా చర్చించారు.ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా పరిధిలోని 460 గ్రామపంచాయతీల్లో ప్రతి గ్రామపంచాయతీకి రోజుకు 50 మంది కూలీలకు తగ్గకుండా ఉపాధి పనులు కల్పించేలా



అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. కూలీలకు పని కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, గ్రామాల వారీగా కూలీల అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా పనులు ప్రారంభించాలని ఆదేశించారు.జిల్లాలోని మైనర్, మేజర్ నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన కాలువల్లో పేరుకుపోయిన మట్టి, పూడికతో పాటు జమ్ము, ఇతర పిచ్చి మొక్కలను తొలగించే పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. కాలువలు శుభ్రంగా ఉంటే సాగునీరు సక్రమంగా ప్రవహించి చివరి ఆయకట్టు వరకు నీరు చేరేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. తద్వారా రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గడంతో పాటు వ్యవసాయ ఉత్పత్తి పెరుగుదలకు దోహదపడుతుందని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు సంబంధించిన పనులతో పాటు గ్రామీణ ప్రజలకు నేరుగా ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలను కూడా గుర్తించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ముఖ్యంగా పొలాలకు వెళ్లే రహదారులను మరమ్మతులు చేసి రాకపోకలకు అనుకూలంగా తీర్చిదిద్దాలని తెలిపారు. వ్యవసాయ పనులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు.అర్హత కలిగిన రైతుల పొలాల్లో ఫామ్ పాండ్స్ (వ్యవసాయ క్షేత్రాల్లో నీటి నిల్వ కుంటలు) ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఫామ్ పాండ్స్ ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంతో పాటు అవసరమైన సమయంలో పంటలకు నీటిని అందించుకునే అవకాశం ఉంటుందని, పశువుల అవసరాలకు కూడా నీరు ఉపయోగపడుతుందని వివరించారు. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గించడంతో పాటు రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు.ఉపాధి హామీ పనుల ఎంపికలో కేవలం కూలీలకు పని కల్పించడమే కాకుండా, ఆ పనుల ద్వారా గ్రామాలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరేలా చూడాలని, ప్రతి గ్రామంలో అందుబాటులో ఉన్న వనరులు, వ్యవసాయ అవసరాలు, నీటి వనరులు, రహదారుల పరిస్థితులను పరిశీలించి ప్రాధాన్యత క్రమంలో పనుల జాబితాను సిద్ధం చేయాలని ఆదేశించారు.గ్రామపంచాయతీల వారీగా పనుల గుర్తింపు, కూలీల సమీకరణ, పనుల ప్రారంభం, అమలు తీరును సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ కూలీలకు ఉపాధి కల్పించే బాధ్యత అధికారులపై ఉందని, ఈ విషయంలో సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను పెంపొందించడంతో పాటు వ్యవసాయ రంగానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, నీటి వనరులను సంరక్షించడం, రైతుల జీవనోపాధిని మెరుగుపరచడం లక్ష్యంగా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రజల ప్రాణాలను కాపాడడమే లక్ష్యంగా రోడ్డు భద్రత చర్యలు చేపట్టాలి

రోడ్లు,ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వెంటనే తొలగించాలి
ఎస్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలి
పీఎం రాహత్ పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
జిల్లాలో ప్రజల ప్రాణాలను కాపాడడమే ప్రధాన లక్ష్యంగా రోడ్డు భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేయాలని, రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ క్షేత్రస్థాయిలో సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ దేవ సహాయం, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు కేవలం అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం సరిపోదని, ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని సూచించారు. పోలీస్,



రవాణా, రోడ్లు మరియు భవనాలు, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లాలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ హెచ్చరిక బోర్డులు, రహదారి సూచికలు, వేగ నియంత్రణ ఏర్పాట్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని, రాత్రి సమయాల్లో ప్రమాదాలు జరగకుండా రహదారులపై తగిన వెలుతురు, స్పష్టమైన హెచ్చరిక సూచికలు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారులు, ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించడం, వాహనాలను నిలిపి ఉంచడం వల్ల పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇలాంటి ఆక్రమణల వల్ల ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతుందని కలెక్టర్ తెలిపారు.ముఖ్యంగా ఎస్పీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ కార్యాలయం వరకు ఉన్న రహదారిపై ఆక్రమణలను గుర్తించి వెంటనే తొలగించాలని, పట్టణంలోని ఇతర ప్రధాన రహదారులు,ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించి పాదచారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాద బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించేందుకు ప్రజలు ముందుకు వచ్చేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.ఈ విషయంలో పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రమాద బాధితులకు తక్షణ సహాయం అందేలా చూడాలని ఆదేశించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సూచించారు. చేపట్టిన చర్యల అమలును నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు రోడ్డు భద్రతా నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి పాలమూరు జిల్లా మొత్తం కరువు జిల్లాగా ప్రకటించాలి

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి
రాబోయే యాసంగి పంటకు కూడా రైతులకు పరిహారం చెల్లించాలి
సాయం అందించకపోతే రైతులతో సెక్రటేరియట్ ముట్టడిస్తాం
మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి పంట నష్టపరిహార సహాయం అందించకపోతే రైతులతో కలిసి సెక్రటేరియట్ ముట్టడిస్తామని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాస గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కరువు మండలాలలో ఉమ్మడి జిల్లాలో 15 మండలాలను ప్రకటించకపోవడం దారుణమని మండిపడ్డారు. 15 మండలాలలో రైతులు ప్రజలు సాగునీరు తాగునీరు అందించాలని ఉద్యమాలు చేస్తున్న ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రంలో కరువును ప్రకటించడం కాదని అధికారులతో సమీక్షలు జరిపి రైతులకు పంట నష్టపరిహారం అందించడంతో పాటు ప్రజలకు నిత్యవసర వస్తువులను కరువు సాయాన్ని అందించాలని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కరువును ఎదుర్కొనేందుకు సమీక్షలు జరిపి రైతులకు పరిహారం అందించడంతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం వల్ల ప్రజల ఇబ్బందులను తీర్చడం జరిగిందని గుర్తు చేశారు. హెచ్చరికలు జారీ చేయడం కాదని సహాయం అందించి చిత్తశుద్ధిలో నిరూపించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్చంపేట నియోజకవర్గం లోని ఎత్తైన ప్రాంతంలో చెంచు పెంటలు త్రాగునీరు అందక కుటుంబం కుటుంబం తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న సమయంలో మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశపెట్టి పైపైన్ ద్వారా తాగునీటిని అందించామని తెలిపారు సోలార్ వ్యవస్థను బలోపేతం చేసి పెంటలలో 24 గంటలు నీటిని అందించామని అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వం బేషజాలకు పోయి ప్రాజెక్టుల ద్వారా నీటిని కూడా నింపడం లేదని అన్నారు. తమ ప్రభుత్వ హయాంలో 2300 చెరువులను ప్రాజెక్టుల నీటి ద్వారా నింపి భూగర్భ జలాలను పెంచడం వల్ల త్రాగునీటి సమస్య ఏర్పడలేదని ప్రస్తుతం అన్ని ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలను ఉందన్నారు తాము పశుగ్రాసం కొరత ఏర్పడకుండా రైతులకు 50 శాతం సబ్సిడీతో విత్తనాలను సరిపడా చేశామని కరోనా సమయంలో కూడా ప్రజలను ఆదుకున్నామన్నారు. 13 లక్షల కిలోమీటర్లు పైప్ లైన్ ఏర్పాటు చేసి నీటి సమస్యను పరిష్కరించడం వల్ల 2014 – 15లో కోటి ఎకరాల వ్యవసాయం పెరిగిందని వివరించారు.తెలంగాణ సాగునీటిపారుదల శాఖలో అద్వైజరిగా ఆంధ్ర ప్రాంతం అధికారి ఉండటంవల్ల ప్రాజెక్టులు పూర్తి కావడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉపాధి హామీ పథకం పనులను ముమ్మరం చేయాలని విద్యుత్ సమస్యలు పరిష్కరించడంతోపాటు సాగు తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.పట్టభద్రులైన ప్రతి ఓటరు తమ వివరాలను ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య, మాజీ జడ్పిటిసి శ్రీశైలం, కౌన్సిలర్లు గంగాధర్,జేపీ చారి,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబురావు, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు షఫీ ఉల్లా ఖాన్, కేశవులు గౌడ్, శంకర్ గౌడ్, కురుమయ్య, కిషోర్ గౌడ్, టింకు తదితరులు పాల్గొన్నారు.



నవంబర్ 1 నుంచి 15 వరకు మాదకద్రవ్యాల నిరోధానికి ప్రత్యేక డ్రైవ్

విద్యాసంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల విక్రయాలపై ప్రత్యేక నిఘా

విద్యాసంస్థల పరిసరాల్లో 100 అడుగుల పరిధిలో గుట్కా, సిగరెట్లు, మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా చర్యలు తీసుకోవాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:

జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సూచించారు. శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నార్కో కోఆర్డినేషన్ కమిటీ (ఎన్‌సీఓఆర్‌డీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, గంజాయి సాగు నియంత్రణ, సంబంధిత కేసుల దర్యాప్తు పురోగతి, వివిధ శాఖలు చేపడుతున్న చర్యలపై



సమీక్షించారు. మాదకద్రవ్యాల నియంత్రణకు తమ శాఖల పరిధిలో అమలు చేస్తున్న చర్యలను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ మాట్లాడుతూ నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు నిర్వహించే ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా విద్యాసంస్థల పరిసరాల్లోని పాన్‌షాపులు, ఇతర దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా మత్తు పదార్థాలు విక్రయించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల పరిసరాల్లో 100 అడుగుల పరిధిలో గుట్కా, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాల విక్రయాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, యువత మాదకద్రవ్యాలకు బానిస కాకుండా పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ రమేష్ కుమార్ ను కలెక్టర్ ఆదేశించారు.మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వాటి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్ దేవ సహాయం, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో బన్సీలాల్‌తో పాటు పోలీస్, అటవీ, వ్యవసాయ, విద్య, వైద్య ఆరోగ్య, సాంఘిక సంక్షేమ, డ్రగ్స్ కంట్రోల్, ఎక్సైజ్ తదితర శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కరువు పరిస్థితులపై శాఖల వారీగా సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలి

నాగర్ కర్నూల్ జిల్లాలో 13 మండలాలు కరువు ప్రాంతాలుగా గుర్తింపు

గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:

నాగర్ కర్నూల్ జిల్లాలోని 13 మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ తెలిపారు.కరువు పరిస్థితుల నేపథ్యంలో ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలకు వ్యవసాయ, ఉద్యాన శాఖల పంటల నష్ట సేకరణతో పాటు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళికలు రూపొందించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, వ్యవసాయ, ఉద్యానవన, మిషన్ భగీరథ, నీటిపారుదల, భూగర్భ జల, డీఆర్డీఏ, పంచాయతీరాజ్ తదితర శాఖల జిల్లా అధికారులతో కరువు మండలాల్లో చేపట్టవలసిన చర్యలు నివేదికలు ప్రణాళికలపై అదనపు కలెక్టర్లు బి.చెన్నయ్య, దేవసహాయం తో కలిసి జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరువు పరిస్థితులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి, వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా శాఖల వారీగా పూర్తి స్థాయి నివేదికలు రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.కరువు ప్రభావాన్ని అంచనా వేయడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, అందుబాటులో ఉన్న గణాంకాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, సంబంధిత శాఖల రికార్డుల ఆధారంగా స్పష్టమైన సమాచారాన్ని సేకరించాలని సూచించారు. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఉర్కొండ, వెల్దండ, కల్వకుర్తి, వంగూరు, చారకొండ, అమ్రాబాద్, పదరా, అచ్చంపేట, బల్మూరు, లింగాల, పెద్దకొత్తపల్లి, కోడేరు, బిజినేపల్లి మండలాలను రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించిందని తెలిపారు. ఈ మండలాల్లో నెలకొన్న పరిస్థితులను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని



సూచించారు. ముఖ్యంగా వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో ఉన్న తాగునీటి వనరులు, బోరుబావులు, చేతిపంపులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నీటి సరఫరా పైపులైన్ల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. 15 రోజులకు ఒకసారి విధిగా నీటి సరఫరా పై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే సమస్యను గుర్తించి పరిష్కరించాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ తాగునీటి సరఫరా ఏర్పాట్లకు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.మిషన్ భగీరథ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, భూగర్భ జల శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ప్రతి గ్రామంలో తాగునీటి లభ్యతపై నిరంతర పర్యవేక్షణ చేయాలని తెలిపారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్న గ్రామాలను ముందుగానే గుర్తించి, అక్కడ అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల నుంచి తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి పరిష్కరించేందుకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు.అదేవిధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కరువు పరిస్థితుల ప్రభావాన్ని అంచనా వేస్తూ రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని కలెక్టర్ తెలిపారు. పంటల పరిస్థితి, సాగునీటి లభ్యత, భూగర్భ జలమట్టాలు తదితర అంశాలను ఎప్పటికప్పుడు పరిశీలించి సంబంధిత నివేదికలను సమర్పించాలని సూచించారు.జిల్లాలో కరువు పరిస్థితులపై రూపొందించే నివేదికలో అన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని సమన్వయంతో పొందుపరచాలని, శాఖల వారీగా సమర్పించే గణాంకాలు పరస్పరం సరిపోలేలా పరిశీలించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలు, నిర్దేశిత ప్రొఫార్మాలకు అనుగుణంగా నివేదికలను రూపొందించి, నిర్ణీత సమయంలో సమర్పించాలని తెలిపారు.ప్రతి శాఖాధికారి తన శాఖకు సంబంధించిన సమాచారాన్ని బాధ్యతాయుతంగా పరిశీలించి, అవసరమైన ఆధారాలు, గణాంకాలు, క్షేత్రస్థాయి వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. అన్ని శాఖల మధ్య సమన్వయం ఉండాలని, జిల్లా కరువు నివేదిక సమగ్రంగా, వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టే విధంగా ఉండాలని పేర్కొన్నారు.కరువు పరిస్థితుల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడటం అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి క్షేత్రస్థాయిలో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజలకు సకాలంలో అవసరమైన సేవలు అందించాలని ఆదేశించారు.సంబంధిత శాఖల అధికారులు తమ పరిధిలోని గ్రామాల వారీగా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ పాండు, ఆర్డీవోలు అర్చన, బన్సీలాల్, జిల్లా అధికారులు యశ్వంతరావు, చిన్న ఓబులేసు, శ్రీరాములు, సుధాకర్ సింగ్, తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాల్లో నూతన వెలుగులు నింపుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం


అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు

నూతన గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం

:నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతోందని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అన్నారు.ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకొని లబ్ధిదారులందరూ తమ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం ప్రయోజనం అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని స్పష్టం చేశారు.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించేందుకు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ శుక్రవారం పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వెంకటమ్మ, కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, ఇతర సంబంధిత శాఖల అధికారులతో కలిసి గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.గ్రామానికి చెందిన ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారురాలు పెబ్బేటి నిర్మలమ్మ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకొని శుక్రవారం శుభ సందర్భంలో గృహప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ అధికారులు, గ్రామ సర్పంచ్ వెంకటమ్మతో కలిసి నూతన గృహాన్ని సందర్శించారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. నూతన గృహంలోకి అడుగుపెట్టిన నిర్మలమ్మ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆమెకు శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా లబ్ధిదారురాలు నిర్మలమ్మ కుటుంబ పరిస్థితులు, పిల్లల విద్యాభ్యాసం తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సహకారంతో సొంత ఇంటిని నిర్మించుకొని గృహప్రవేశం చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటీల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన సహకారం అందించాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన ఇళ్ల నిర్మాణాలను నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని, నిర్మాణ పనుల్లో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని సూచించారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్, పెద్దకొత్తపల్లి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ, గ్రామ సర్పంచ్ వెంకటమ్మ, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సంగీత పోటీల్లో ప్రతిభ చాటిన ఉపాధ్యాయుడు ఇద్రిస్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:

ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సంగీత పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు ఇద్రిస్ ప్రతిభను చాటుకుని భాషా సాంస్కృతిక శాఖ తరఫున ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు.డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్రభారతిలో నిర్వహించిన ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ సంగీత పోటీల్లో నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ తరఫున ఉపాధ్యాయుడు ఇద్రిస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంగీత రంగంలో తన ప్రతిభను ప్రదర్శించి భాషా సాంస్కృతిక శాఖ తరఫున ప్రశంసా పత్రాన్ని అందుకోవడం విశేషం.బిజినపల్లి మండలం వెల్గొండ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(ఎంపీపీఎస్)లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఇద్రిస్, విద్యాబోధనతో పాటు సంగీతంపై ఉన్న ఆసక్తి, అభిరుచితో ఈ పోటీల్లో పాల్గొని ప్రశంసలు అందుకున్నారు.జిల్లా స్థాయిలో ఉపాధ్యాయుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ రాష్ట్రస్థాయి వేదికపై జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించి ప్రశంసా పత్రం అందుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆయన ప్రతిభను డిఇఓ రమేష్ కుమార్ అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అయన ఆకాంక్షిస్తున్నారు.



విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగుల పంపిణీ

నకిరేకల్, మన ప్రజాపక్షం:

నకిరేకల్ పట్టణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.సర్వ శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో అందరూ చదవాలి-అందరూ ఎదగాలి అనే కార్యక్రమంలో భాగంగా యూనివర్సల్ ఫౌండేషన్, కోగ్టా ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థల సహకారంతో విద్యార్థులకు ఉచితంగా స్కూల్ బ్యాగులను అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే వేముల విద్యార్థులకు స్వయంగా స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. విద్యాభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని, భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, కోగ్టా ఫైనాన్షియల్ సర్వీసెస్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

నాగర్ కర్నూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతం



నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కంటి పరీక్షల శిబిరం నిర్వహణ విజయవంతం అయిందని వైద్యులు తెలిపారు.పాత కలెక్టరేట్ భవనంలోని 102వ గదిలో ఈ శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 55 మందికి కంటి పరీక్షలు చేసినట్టు వైద్యులు తెలిపారు.కంటి పరీక్షల్లో 20 మందికి క్యాటరాక్ట్ సమస్య ఉన్నట్లు గుర్తించామని అన్నారు.అర్హులైన 20 మందిని ప్రత్యేక అంబులెన్స్‌లో లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించామన్నారు.శిబిరంలో రోగులకు కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్టు తెలిపారు.కంటి ఆరోగ్యంపై రోగులకు వైద్యుల ప్రత్యేక సూచనలు చేశారు.కంటి చూపు ఆరోగ్యంగా ఉండాలంటే విటమిన్-ఏ అధికంగా ఉండే ఆహారం తీసుకోవాలని సూచించారు.క్యారెట్, ఆకుకూరలు, చేపలు వంటి పోషకాహారం నిత్యం తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భరత్ కుమార్ రెడ్డి పలు వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆప్తాల్మిక్ అధికారులు కొత్ర బాలాజీ, పోతుల సుకుమారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఓరుగంటి శ్రీనివాస్, బాదం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



చేనేత సొసైటీలలో జరుగుతున్న అక్రమ లావాదేవిలపై అధికారులు విచారణ కమిటీలు వేయడం అభినందనీయం

నారాయణపేట,మన ప్రజాపక్షం:
చేనేత సొసైటీలలో జరుగుతున్న అక్రమ లావాదేవులపై విచారణ చేపట్టాలని,ప్రభుత్వ సొమ్ము లూటీ చేస్తున్నా సంఘం అధ్యక్ష కార్యదర్శిలపై చట్టపరమైన చర్య తీసుకోవాలని అఖిలపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేసారు. అఖిలపక్షం పార్టీల ఆధ్వర్యంలో గత కొంతకాలంగా ఆందోళన చేస్తున్నడంతో అధికారులు దిగివచ్చి ముఖ్యంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ విచారణకు ఆదేశించడం అదేవిధంగా రాష్ట్ర జౌళి శాఖ కమీషనర్ 51 విచారణ కు ఆదేశించడం అభినందనీయమని అఖిలపక్షం పార్టీ నేతలు తెలిపారు.చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు కెంచి నారాయణ, బిఎస్పి జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాస్, సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం రాజ్యాధికార పార్టీ (తీన్మార్ మల్లన్న) జిల్లా అధ్యక్షులు కృష్ణమడివల్ తదితరులు నారాయణపేట జిల్లా కేంద్రంలో శనివారం రోజు జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారులు స్పందన తీరుకు అభినందనీయమన్నారు.విచారణ కమిటీలు సత్వరమే విచారించి ప్రభుత్వ సొమ్మును లూటీ చేస్తున్న అక్రమార్కుల పైన సత్వరమే చర్య తీసుకోవాలని, సొసైటీలను అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న అక్రమార్కుల పైన చర్య గైకొనాలని డిమాండ్ చేశారు.అక్రమాలకు పాల్పడిన సొసైటీ అధ్యక్ష కార్యదర్శులపై చట్టపరమైన చర్య తీసుకోవాలని కోరారు.కార్మిక హక్కుల కోసం చేనేత కార్మికులందరూ ఏకతాటి పైకి రావాలని గాంధీనగర్ కార్మికులకు యాజమాన్యపు హక్కుల కోసం అఖిలపక్ష నాయకులు చేస్తున్న పోరాటంలో కలిసి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బిఎస్పి నారాయణపేట నియోజకవర్గం అధ్యక్షులు దాసరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు నవంబర్ 6 వరకు

అర్హులైన పట్టభద్రులు గడువులోగా ఓటరుగా నమోదు చేసుకోవాలి
జావీద్ హుస్సేన్, బీజేపీ జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి



నారాయణపేట,మన ప్రజాపక్షం:
మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అర్హులైన పట్టభద్రులు నవంబర్ 6వ తేదీలోగా తమ ఓటును నమోదు చేసుకోవాలని బిజెవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.మంజునాథ్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదును పూర్తి చేసుకోవాలని సూచించారు. నిర్ణీత గడువులోగా ఓటరు నమోదు చేసుకొని, రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.



పార్టీల జెండాలు వేరు.... ప్రయాణం మాత్రం ఒక్కటే!

రాజకీయాల్లో ప్రత్యర్థులు కావచ్చు... వ్యక్తిగతంగా స్నేహితులే!

నారాయణపేట, మన ప్రజాపక్షం:
నారాయణపేట జిల్లాలో ఓ ఆసక్తికరమైన దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. శుక్రవారం నారాయణపేట పట్టణంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ నాయకుడు వెంకటేష్ గౌడ్ ఒకే ద్విచక్ర వాహనంపై కలిసి ప్రయాణిస్తూ కనిపించారు. వేర్వేరు రాజకీయ పార్టీలకు చెందిన ఇద్దరు నాయకులు ఒకే వాహనంపై కనిపించడంతో అటుగా వెళ్తున్న వారి చూపులు వారిపై నిలిచాయి. జర్నలిస్టులు సైతం ఈ దృశ్యాన్ని కెమెరాల్లో బంధించారు.ఫొటోలు తీస్తున్న జర్నలిస్టులకు ఇద్దరూ చిరునవ్వుతో స్పందించారు. పార్టీలు వేరు కావచ్చు...కానీ అభివృద్ధి విషయంలో అందరి లక్ష్యం ఒక్కటే అంటూ నవ్వుతూ సమాధానమిచ్చారు. రాజకీయం అంటే కేవలం విమర్శలు, ప్రతివిమర్శలు,ఆరోపణలు, ప్రత్యారోపణలే కాదు...రాజకీయ సిద్ధాంతాలు వేరైనా వ్యక్తిగత సంబంధాలను గౌరవించడం, ప్రజా ప్రయోజనాల కోసం కలిసి ఆలోచించడం కూడా ప్రజాస్వామ్య సంస్కృతిలో భాగమే.రాజకీయాల్లో ప్రత్యర్థులుగా ఉండొచ్చు.. కానీ వ్యక్తిగతంగా శత్రువులుగా ఉండాల్సిన అవసరం లేదు. పార్టీల జెండాలు వేరైనా.. ప్రజల ఆకాంక్షలు, ప్రాంత అభివృద్ధి లక్ష్యం ఒక్కటే కావాలి. జెండాలు వేరైనా.. జనమే ముఖ్యం! దారులు వేరైనా.. అభివృద్ధే గమ్యం! వాదనలు వేరైనా.. ఆత్మీయతకు అడ్డుగోడలు ఉండకూడదు!రాజకీయాల్లో పోటీ ఉండాలి.. వ్యక్తిగత కక్షలు కాదు. విమర్శలు ఉండాలి.. విద్వేషాలు కాదు. ప్రజల కోసం పనిచేసే క్రమంలో పరస్పర గౌరవం, స్నేహభావం కొనసాగాలి. రాజకీయం అంటే విడిపోవడమే కాదు.. అవసరమైనప్పుడు ప్రజల కోసం కలిసి నడవడం కూడా అని చాటిచెప్పేలా నిలిచింది ఈ ఆసక్తికరమైన ఫోటో క్లిక్!

భూ రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలి

పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామం పోచాపూర్ శివారులో భూ రీ సర్వే పనుల పరిశీలన
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లి మండలం సాతాపూర్ గ్రామ పరిధిలోని పోచాపూర్ శివారులో జరుగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించి, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించడంతో పాటు భవిష్యత్తులో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ సాతాపూర్ గ్రామ పరిధిలో ఇప్పటివరకు ఎంత మేరకు భూముల రీ సర్వే పూర్తయిందనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన అధికారులు, గ్రామ పరిధిలో మొత్తం 544 ఎకరాల భూమి విస్తీర్ణం ఉండగా, ఇప్పటివరకు 120 ఎకరాల భూమికి రీ సర్వే నిర్వహించినట్లు కలెక్టర్‌కు వివరించారు.మిగిలిన భూములకు కూడా ప్రణాళికాబద్ధంగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. భూములను సంబంధిత భాగాలుగా విభజించి, ప్రతి భూభాగానికి సంబంధించిన



వివరాలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల విషయంలో స్పష్టత ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ముఖ్యంగా భూముల విరాసత్ (వారసత్వ బదిలీ)కు సంబంధించి భవిష్యత్తులో వివాదాలు తలెత్తకుండా ముందుగానే అవసరమైన వివరాలను పరిశీలించి, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. భూ రీ సర్వే సమయంలో సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తూ, క్షేత్రస్థాయి పరిస్థితులకు అనుగుణంగా వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు.భూ రీ సర్వే ప్రక్రియ ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, యాజమాన్య వివరాల్లో స్పష్టత ఏర్పడటంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు.అందువల్ల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, రైతులకు మరియు భూ యజమానులకు ఇబ్బందులు కలగకుండా సర్వే పనులను నిర్వహించాలని సూచించారు.సర్వే ప్రక్రియలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి దశలోనూ సంబంధిత వివరాలను సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో రీ సర్వే పనులను పూర్తి చేసి, భూములకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. గ్రామంలో మిగిలి ఉన్న భూముల రీ సర్వేను కూడా వేగవంతం చేసి, ఎలాంటి అవకతవకలకు తావులేకుండా నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు.కలెక్టర్ వెంట ఏడి సర్వేయర్ గిరిధర్, ఆర్డీవో బన్సీలాల్, ఎమ్మార్వో శ్రీనివాసులు, ఉప సర్పంచ్ బాలీశ్వరమ్మ, వార్డు మెంబర్లు, తదితరులు పాల్గొన్నారు.

విబిజి రామ్ జీ ఉపాధి హామీ పనులు వేగవంతం చేయాలి

గ్రామీణ ప్రాంతాల్లో ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యత కల్పించాలి
కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి
కూలీలతో ముఖాముఖి వేతనాల చెల్లింపుపై ఆరా
ఫీడర్ ఛానల్,కాల్వల పూడికతీత పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను గుర్తించి, వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్, (వి.బి.జి. రామ్ జీ) పథకం ద్వారా ఉపాధి హామీ కూలీలకు నిరంతరం పనులు కల్పించాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామంలో వివిజి రామ్ జీ పథకం కింద ఉపాధి హామీ కూలీలతో చేపడుతున్న ఫీడర్ ఛానల్ పనులు, కాల్వల్లో జమ్ము పూడికతీత పనులను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.జిల్లా కలెక్టర్ పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలతో నేరుగా మాట్లాడారు. వారి పని వివరాలు, రోజువారీ పనుల నిర్వహణ, పని ప్రదేశాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, కూలీ వేతనాల చెల్లింపులపై ఆరా తీశారు. కూలీలకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వేతనాలు అందుతున్నాయా, చెల్లింపుల్లో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తమకు సంబంధించిన కూలీ డబ్బులు విడుదల అవుతున్నాయని కూలీలు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. కూలీలకు రావాల్సిన వేతనాలు ఎలాంటి జాప్యం లేకుండా అందేలా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని కలెక్టర్ సూచించారు. కూలీల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని



తెలిపారు.ఉపాధి హామీ పథకం అమలులో క్షేత్రస్థాయి అధికారుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో చేపడుతున్న పనులు కేవలం ఉపాధి కల్పనకే పరిమితం కాకుండా భవిష్యత్తులో గ్రామీణ ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన పనులను గుర్తించి వి.బి.జి. రామ్ జీ పథకం ద్వారా చేపట్టాలని సూచించారు. గ్రామాల్లో నీటి వనరుల అభివృద్ధి, ఫీడర్ ఛానల్ పనులు, కాల్వల పూడికతీత వంటి ప్రజోపయోగ పనులకు ప్రాధాన్యత కల్పించాలని తెలిపారు.గ్రామ అవసరాలను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని, గ్రామాల్లో చేపట్టే పనులు ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చేలా ఉండాలని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు కూలీలకు ఉపాధి, ఆర్థిక భరోసా కల్పించే దిశగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పనుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని అధికారులకు జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని కూలీలకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాల్లో శాశ్వత ప్రయోజనం చేకూర్చే ఆస్తుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చేపట్టిన పనులు నిర్ణీత ప్రమాణాల ప్రకారం, నాణ్యతతో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.గ్రామస్థాయిలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ పనులకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, కూలీలకు పనులు కల్పించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలిపారు.ప్రస్తుతం సూపర్ ఎల్ నినో ప్రభావంతో ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ పనులు నిర్వహించే ప్రదేశాల్లో కూలీల ఆరోగ్య భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. పని ప్రదేశాల్లో తప్పనిసరిగా నీడ, స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.ఎండ తీవ్రత కారణంగా కూలీలు వడదెబ్బకు గురికాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశాల్లో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని స్పష్టం చేశారు. కూలీల ఆరోగ్యానికి ఇబ్బంది కలగకుండా తగిన జాగ్రత్తలతో పనులు నిర్వహించేలా పర్యవేక్షించాలని సూచించారు.ఫీడర్ ఛానల్ పనులు, కాల్వల పూడికతీత వంటి పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నీటి పారుదల సదుపాయాల మెరుగుదలకు, స్థానిక అవసరాల పరిష్కారానికి దోహదపడేలా పనుల నాణ్యతను కాపాడాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ పథకాల అమలులో ప్రజలకు మెరుగైన ఫలితాలు అందించడమే లక్ష్యంగా అధికారులు అంకితభావంతో పనిచేయాలని, కూలీల సంక్షేమం, పనుల నాణ్యత, ప్రజోపయోగ ఆస్తుల కల్పనకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో బన్సీలాల్, తాహసిల్దార్ శ్రీనివాసులు, ఏపీవో సంబంధిత శాఖల అధికారులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది, క్షేత్రస్థాయి సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.



తెల్కపల్లి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి

తెల్కపల్లి, మన ప్రజాపక్షం:
శుక్రవారం నాడు తెల్కపల్లి మండల సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.అనంతరం ఎల్ నినో ప్రభావంపై చర్చిస్తూ, రాబోయే వాతావరణ మార్పులు, వర్షపాత లోటు కారణంగా వ్యవసాయ రంగానికి ఎదురయ్యే సవాళ్లను ముందుగానే అంచనా వేసి రైతులకు అవసరమైన అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు.రైతుల సంక్షేమం, ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం

29వ వార్డులో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమం

జనగామ,మన ప్రజాపక్షం:
పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా జనగామ పట్టణంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పార్టీ నాయకులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. జనగామ శాసనసభ్యులు డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి నాయకత్వంలో, వారి ఆదేశాల మేరకు పట్టణంలోని 29వ వార్డులో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా చేపట్టారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రతి ఇంటిని సందర్శిస్తూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు ప్రాధాన్యతను ప్రజలకు వివరించారు. ఓటు నమోదు చేసుకోవాల్సిన అర్హతలు, అవసరమైన వివరాలు, నమోదు ప్రక్రియ గురించి పట్టభద్రులకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు.పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి అర్హులైన పట్టభద్రులు మిగిలిపోకుండా ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తూ నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తున్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్, 29వ వార్డు ఎమ్మెల్సీ కోఆర్డినేటర్ సయ్యద్ అస్లాం, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పంతులు ప్రభాకర్, తుంగ సతీష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలి

నాగర్ కర్నూల్‌లో కొనసాగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

నాగర్ కర్నూల్,మన ప్రజాపక్షం:నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి నివాసంలో హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్ నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు కార్యక్రమాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎంతో సమన్వయంతో ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు.నియోజకవర్గంలోని ప్రతి గ్రామం, ప్రతి మండలంలో పట్టభద్రుల వివరాలను గ్రామాల వారీగా సేకరిస్తూ, అర్హులైన పట్టభద్రులను గుర్తించి వారికి అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ ఓటరు నమోదును స్వయంగా చేయించడం సంతోషకరమైన విషయమని



పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు చూపిస్తున్న చొరవ, అంకితభావం పార్టీ పట్ల వారికున్న నిబద్ధతకు నిదర్శనమని కొనియాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరు నమోదు అత్యంత కీలకమైన ప్రక్రియ అని, అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు అయ్యేలా నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.కేవలం ఓటరు నమోదు చేయడమే కాకుండా, నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించాలని అన్నారు.బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనిచేయాలని, గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ శ్రేణులన్నీ ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటర్లను సమీకరించడంలో, వారిని ఓటరుగా నమోదు చేయించడంలో మర్రి జనార్దన్ రెడ్డి తీసుకుంటున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రశంసించారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ శ్రేణుల సమష్టి కృషితో విజయాన్ని సాధించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రులారా....ప్రజాస్వామ్య పరిరక్షణలో మీ భాగస్వామ్యాన్ని నమోదు చేసుకోండి!

కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్




నారాయణపేట,మన ప్రజాపక్షం: హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నారాయణపేట శాసనసభ్యురాలు చిట్టెం పర్ణిక రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుంభం శివకుమార్ రెడ్డి నారాయణపేట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కర్రె వెంకటేష్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో పట్టభద్రుల ఓటు కేవలం ఒక హక్కు మాత్రమే కాదు.. సమాజ భవిష్యత్తు, విద్యావంతుల ఆలోచనలు, ప్రజా సమస్యలపై బాధ్యతాయుతమైన అభిప్రాయాలను ప్రతిబింబించే విలువైన అవకాశం. విద్యావంతులు, మేధావులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువ పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునే దిశగా ముందడుగు వేయాలని వారు కోరారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఓటరు నమోదుకు నవంబర్ 5వ తేదీ చివరి గడువు కావున, చివరి తేదీ వరకు వేచి చూడకుండా అర్హులైన ప్రతి పట్టభద్రుడు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ముఖ్యంగా యువత, విద్యావంతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని, తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సహచర పట్టభద్రులకు కూడా ఈ విషయాన్ని తెలియజేసి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని కోరారు.

విద్యార్థి విప్లవ ఉద్యమకారుడు కామ్రేడ్ సాయిలుకు ఘన నివాళి

అమ్రాబాద్ లో 42వ వర్ధంతి సభ

అమ్రాబాద్,మన ప్రజాపక్షం:
పచ్చని నల్లమల కొండ అడవుల్లో పుట్టి, పేద ప్రజల హక్కుల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన విద్యార్థి విప్లవ ఉద్యమకారుడు కామ్రేడ్ సాయిల్ అన్న 42వ వర్ధంతి సభను అచ్చంపేటలో ఘనంగా నిర్వహించారు. సాయిల్ అన్న అభిమాన సంఘం, సీపీఐ పార్టీ అచ్చంపేట ఇన్‌చార్జి గోపాల్, యురేనియం వ్యతిరేక పోరాట సమితి నాసరన్న, వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. 1962 ఫిబ్రవరి 1న మల్లమ్మ, రాములయ్య ఎరుకల దంపతులకు జన్మించిన సాయిలు చిన్ననాటి జీవితం పేదరికం, కష్టాల మధ్య సాగింది. తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ, బుట్టలు అల్లుకుంటూ జీవనం కొనసాగించేవారు. తల్లి మల్లమ్మ పట్టుదలతో తన కుమారుడికి విద్య అందించాలనే లక్ష్యంతో అమ్రాబాద్ మండలంలోని డీనోటిఫైడ్ ట్రైబ్స్ హాస్టల్‌లో చేర్పించి ప్రాథమిక విద్యను అందించారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యను అభ్యసించారు.విద్యార్థి దశలోనే గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న దోపిడీ వ్యవస్థ, సామాజిక అసమానతలు, పేద ప్రజల వెనుకబాటుతనాన్ని గుర్తించిన సాయిల్ అన్న సమాజ మార్పు కోసం ఉద్యమబాట పట్టారు. ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ లో పనిచేస్తూ ప్రతి గ్రామానికి విద్య, వైద్యం అందాలనే ఆశయంతో ప్రజల్లో చైతన్యం



కల్పించారు.జననాట్యమండలి సహకారంతో పల్లెపల్లెకు వెళ్లి తన పాటలతో ప్రజలను ఆకట్టుకుంటూ, సమాజంలో జరుగుతున్న దోపిడీ, అన్యాయాలపై ప్రజలకు అవగాహన కల్పించేవారు. ఆయన ప్రజా చైతన్య కార్యక్రమాలను భూస్వామ్య, పెట్టుబడిదారీ శక్తులు సహించలేకపోయాయని ఉద్యమ సహచరులు గుర్తుచేస్తున్నారు.ఈ క్రమంలో 1984 అక్టోబర్ 30న మహబూబ్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని మెట్టుగడ్డ వద్ద కిరాయి గుండాల చేత నాటుకోడవళ్లతో నరికి, కత్తులతో పొడిచి సాయిల్ అన్నను హత్య చేశారని ఆయన అభిమానులు పేర్కొన్నారు. అప్పట్లో ఈ ప్రాంతంలో నక్సలైట్ ఉద్యమం విస్తరించకముందే ప్రజా సమస్యలపై ఆయన సాగించిన పోరాటం నల్లమల ప్రాంత ప్రజల్లో చెరగని ముద్ర వేసిందని తెలిపారు.సాయిల్ అన్న భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన ఆశయాలు, పోరాట స్ఫూర్తి నల్లమల ప్రాంతంలోని ప్రతి పల్లెలో నేటికీ గుర్తుండిపోయాయని వక్తలు పేర్కొన్నారు.ఈ సందర్భంగా కామ్రేడ్ సాయిలుకు ఘనంగా నివాళులర్పిస్తూ జోహార్ కామ్రేడ్ సాయిల్ అన్న..వృథా కాదు నీ మరణం..రేపటి సూర్యుని కిరణం..అంటూ నినదించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు, సాయిల్ అన్న అభిమానులు, ఉద్యమకారులు కార్యక్రమంలో సభ నిర్వాహకులు చిలుముల నిరంజన్, సర్పంచ్ కోటయ్య,కళాకారులు రామకోటి,మాల మమహానాడు దివాకర్, గోవర్ధన్,మాధవానిపల్లి మురళి,అంబేద్కర్ సంఘం సామ అనిల్, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు రమేష్,శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్‌కు స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వినతి

అచ్చంపేట,మన ప్రజాపక్షం:
ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా రీజియన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న బదిలీ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ప్రతి డిపోలో శాస్త్రీయ పద్ధతిలో రూట్ సర్వే నిర్వహించి పని గంటల్లో మార్పులు చేపట్టాలని కోరారు. వారానికి తప్పనిసరిగా ఒక స్పెషల్ ఆఫ్ డ్యూటీ కల్పించాలని, అన్ని డిపోల్లో కార్మికులకు ఆర్వో వాటర్ సౌకర్యం ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా హైదరాబాద్ రూట్‌లో స్టేజీల మార్పునకు సంబంధించిన ప్రతిపాదనలను విరమించుకోవాలని కోరారు.కార్మికుల సమస్యలపై స్పందించిన రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, వినతిపత్రంలో పేర్కొన్న అంశాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఎస్.వెంకటయ్య ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ కార్యదర్శి, మహబూబ్‌నగర్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర నాయకులు ప్రభాకర్, అధ్యక్ష కార్యదర్శులు కృష్ణయ్య, వెంకటయ్య, నాయకులు శ్రీనివాసులు, నారాయణ, అంబయ్య, అశోక్ గౌడ్, వెంకటేశ్వర్లు, బాల్ నారాయణ, తిరుపతి, ఎం.డి.ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో వైయస్సార్ సిపి అభ్యర్థులు

పాదలకూరు మస్తాన్‌రెడ్డి నగర్‌లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల ఇంటింటి ప్రచారం
గడపగడపకూ వెళ్లి ఓటర్లను కలిసిన ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు
వైఎస్ జగన్ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఓట్ల అభ్యర్థన
కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో ప్రజల్లోకి అభ్యర్థులు
ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి

పొదలకూరు,మన ప్రజాపక్షం:
పొదలకూరు పట్టణంలోని మస్తాన్‌రెడ్డి నగర్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ, జడ్పీటీసీ అభ్యర్థులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.బిట్-1,2,3 ఎంపీటీసీ అభ్యర్థులు గంగవరపు లక్ష్మి కళ్యాణి,వాకాటి సంధ్య, కోవూరు వెంకటేశ్వర్లు, జడ్పీటీసీ అభ్యర్థి బచ్చల సురేష్‌కుమార్‌రెడ్డి ప్రజలను నేరుగా కలుసుకుని పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తమను గెలిపించాలని



విజ్ఞప్తి చేశారు.

సంక్షేమ పథకాలతో పేదలకు అండ

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో అమలైన అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన, వసతి దీవెన, ఆరోగ్యశ్రీ వంటి పథకాల ద్వారా పేద కుటుంబాలు, రైతులు, మహిళలు, విద్యార్థులకు లబ్ధి చేకూరిందని అభ్యర్థులు ప్రజలకు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందించిన ప్రయోజనాలను గుర్తించి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా నిలవాలని కోరారు.

కాకాణి నాయకత్వంపై విశ్వాసం

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆశీస్సులతో ఎన్నికల బరిలోకి దిగిన అభ్యర్థులు ప్రజల ఆదరణతో విజయం సాధిస్తామనే ధీమా వ్యక్తం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కాకాణి నాయకత్వంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను గుర్తుచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వారి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ పనిచేయడమే తమ లక్ష్యమని అభ్యర్థులు పేర్కొన్నారు. ప్రజలు తమకు అవకాశం కల్పిస్తే బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, స్థానిక అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆశీస్సులు, పార్టీ నాయకులు, కార్యకర్తల సహకారంతో స్థానిక ఎన్నికల్లో విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అచ్చంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ శ్రీనివాస్

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ సిబ్బందికి సూచనలు



అచ్చంపేట,మన ప్రజాపక్షం:
జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు వార్షిక తనిఖీలో భాగంగా అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్ శుక్రవారం అచ్చంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలని, ప్రతి ఫిర్యాదుపై వేగంగా స్పందించి పారదర్శక విచారణ ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక రౌడీషీటర్ల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని సూచించారు.అనంతరం రిసెప్షన్, రైటర్ విభాగాలతో పాటు సిబ్బంది పనితీరును సమీక్షించారు. పోలీస్ స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, కేసులు పెండింగ్‌లో లేకుండా త్వరితగతిన పరిష్కరించాలని ఎస్సై నరేష్‌కు సూచించారు.విధుల్లో చురుకుదనం, బాధ్యతాయుతమైన పనితీరు కనబరచాలని సిబ్బందికి తెలిపారు.ఈ తనిఖీలో అచ్చంపేట సీఐ నాగరాజు, ఎస్సై నరేష్‌తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు వినియోగంపై ఉక్కుపాదం మోపాలి

యువత,విద్యార్థులకు పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలి
పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి
జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

జనగామ, మన ప్రజాపక్షం:
యువతలో పొగాకు వినియోగాన్ని నివారించడంతో పాటు వాటి వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, దుష్ప్రభావాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. శుక్రవారం నాడు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోమ్, డీసీపీ రాజ మహేంద్ర నాయక్ లతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్-2026 అమలు, శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, నిర్దేశిత లక్ష్యాల సాధనపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలల్లో పొగాకు ఉత్పత్తుల దుష్ప్రభావాలపై పోస్టర్లు



రూపొందించి, విస్తృతంగా ప్రచారం చేయాలని, విద్యార్థుల ప్రవర్తనలో వచ్చే మార్పులను ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు గమనించాలని, అనుమానాస్పద పరిస్థితులు గుర్తించినప్పుడు వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.విద్యార్థులు పొగాకు ఉత్పత్తుల బారిన పడకుండా తల్లిదండ్రులు కూడా తమ పిల్లల ప్రవర్తన, స్నేహితుల పరిచయాలు, రోజువారీ కార్యకలాపాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసే వారిపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (కోట్పా-2003), ఎలక్ట్రానిక్ సిగరెట్ల నిషేధ చట్టం (పీస-2019) నిబంధనల ప్రకారం విద్యా సంస్థల పరిసరాల్లో పొగాకు విక్రయాలు జరగకుండా కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.పొగాకు ఉత్పత్తుల నియంత్రణ, నిర్మూలన కోసం పోలీస్, విద్యా శాఖ, ఎక్సైజ్ శాఖలతో పాటు సంబంధిత ఇతర శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. పొగాకు రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.విద్యార్థుల బంగారు భవిష్యత్తును కాపాడటం, యువతను పొగాకు ఉత్పత్తుల మహమ్మారి నుంచి రక్షించడం అందరి బాధ్యత అని, అన్ని గ్రామాలను, విద్యాసంస్థలను పొగాకు రహిత గ్రామాలుగా, విద్యాసంస్థలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో డీఎంహెచ్ఓ వాణి శ్రీ, ప్రోగ్రామ్ అధికారి మల్లిఖార్జున రావు, మునిసిపల్ కమిషనర్ రాజశేఖర్ రెడ్డి, డీఐఈఓ జితేందర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ అధికారి నరసింహ రావు, ఏసిపి భీం శర్మ, ఇతర వైద్యాధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించొద్దు
ఎస్పీ డాక్టర్ జి.వినీత్

నారాయణపేట,మన ప్రజాపక్షం:
నారాయణపేట సర్కిల్ ఆఫీస్‌తో పాటు టౌన్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ జి. వినీత్ వార్షిక తనిఖీ నిర్వహించారు.కేసుల దర్యాప్తు, పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, నేరాల నియంత్రణకు ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదగా వ్యవహరించి, బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఆదేశించారు.బీట్ వ్యవస్థను బలోపేతం చేస్తూ, రాత్రి పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, మహిళల భద్రత, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ప్రజల భద్రతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తిస్తూ మెరుగైన పోలీస్ సేవలు అందించాలన్నారు.



విజిలెన్స్ వారోత్సవం-2026 సందర్భంగా అవినీతి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం

జనగామ, మన ప్రజాపక్షం:
విజిలెన్స్ వారోత్సవం-2026 సందర్భంగా అక్టోబర్ 26 నుండి నవంబర్ 1 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా"సత్యనిష్ఠతో సమృద్ధి" అనే నినాదంతో జనగామ జిల్లా, జనగామ మున్సిపాలిటీ ఆఫీసులో అవినీతి నిర్మూలన, నిజాయితీ, పారదర్శకత మరియు నైతిక విలువల ప్రాముఖ్యతపై అవినీతి నిరోధక శాఖ వరంగల్ రేంజ్ డీఎస్పీ పి.సాంబయ్య అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అధికారులతో "అవినీతికి దూరంగా ఉంటూ, విధి నిర్వహణలో నిజాయితీ, నిబద్ధత, పారదర్శకత పాటిస్తామని, అవినీతి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేస్తామని" ప్రతిజ్ఞ చేయించారు.ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిజాయితీతో, నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా నిర్వహించాలని, ప్రభుత్వ అధికారాలను వ్యక్తిగత ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయరాదని డీఎస్పీ తెలిపారు. అవినీతి వల్ల ప్రజాధనం దుర్వినియోగం కావడమే కాకుండా, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజాసేవలు మరియు ప్రభుత్వ వ్యవస్థలపై ప్రజల విశ్వాసం దెబ్బతింటుందని వివరించారు.ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే తెలంగాణ ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1064 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ప్రభుత్వ ఉద్యోగి, ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, నిజాయితీ మరియు నైతిక విలువలను పాటిస్తూ దేశ అభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. అవినీతిని నివారించడంలో పారదర్శకమైన పరిపాలన, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, ఆకస్మిక తనిఖీలు మరియు ఫిర్యాదులపై సత్వర చర్యలు కీలకమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో టి.రాజ్ కుమార్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జనగామ మున్సిపాలిటీ), సంతోషి (జూనియర్ అకౌంట్ ఆఫీసర్, జనగామ మున్సిపాలిటీ) మరియు జనగామ మున్సిపాలిటీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఓట్ బచావో-దేశ్ బచావో' నిరసనకు జనగామ కాంగ్రెస్ శ్రేణుల పయనం

జనగామ, మన ప్రజాపక్షం
:జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నవంబర్ 1న న్యూఢిల్లీలోని రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఓట్ బచావో – దేశ్ బచావో నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బస్సు మార్గంలో ఢిల్లీకి బయలుదేరారు.ఈ సందర్భంగా జనగామ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ప్రజాస్వామ్య పరిరక్షణ, ఓటు హక్కుల రక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఈ ఉద్యమంలో జనగామ జిల్లా నుంచి నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొనేందుకు ఢిల్లీకి పయనమయ్యారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీ నారాయణ లకావత్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు, ఓటు హక్కుల హరణకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేయడానికి, రాజ్యాంగ విలువలను కాపాడడానికి ఢిల్లీలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, మాజీ మున్సిపల్ చైర్మన్ వేముల్ల సత్యనారాయణ రెడ్డి తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

భారతదేశ ఉక్కు మనిషిగా పేరుందిన సర్దార్ వల్లబ్ భాయ్ పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం



అచ్చంపేట,మన ప్రజాపక్షం:భారతదేశపు ఉక్కుమనిషిగా పేరుగాంచిన సర్దావల్లబ్ లడబా,జూవేర్ భాయ్ పటేల్ దంపతులకు 1875 అక్టోబర్ 31న గుజరాత్ లోని నడియార్ లో జన్మించారు. ఇతను ప్రముఖ స్వాతంత్ర యోధుడిగానే కాకుండా స్వాతంత్రనంతరం సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి గట్టిగా కృషి చేసి సఫలుడై ప్రముఖుడిగా పేరొందారు.హైదరాబాద్, జునగాడ్ లాంటి సంస్థానాలు భారతదేశంలో విలీనం చేసిన ఘనత ఇతనికే దక్కుతుంది. ఇంగ్లాండులో బారిష్టర్ పట్టా పుచ్చుకొని స్వదేశానికి తిరిగి వచ్చి దేశంలో జరుగుతున్న జాతీయ ఉద్యమానికి ఆకర్షితుడై బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మహాత్మా గాంధీ నేతత్వములో పాలు పంచుకున్నాడు. బర్డోలిలో జరిగిన సత్యాగ్రహానికి నాయకత్వం వహించి విజయవంతం చేయడమే కాకుండా దేశ ప్రజల సంక్షేమం కోసం అనేక సాంఘిక ఉద్యమాలను చేపట్టాడు.1931లో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభకు అధ్యక్షత వహించాడు. స్వాతంత్ర అనంతరము జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వములోని కేంద్ర మంత్రిమండలిలో హోం శాఖ మంత్రి గాను,భారత ఉప ప్రధానమంత్రి గాను బాధ్యతలను నిర్వహించాడు. దేశ విభజన అనంతరము అనేక ప్రాంతాలలో జరిగిన అల్లర్లను చాకచక్యంతో అణచివేశాడు.నెహ్రూ మంత్రి మండలిలో ఉన్నను అనేక విషయాలలో నెహ్రూతో విభేదించాడు. నెహ్రూ శాంతికాముకథను కాదని అనేక పర్యాయాలు బల ప్రయోగం చేపట్టి సఫలుడైనాడు. కేవలం 40 మాసాలు మాత్రమే పదవిలో ఉన్నను అనేక దేశ సమస్యలను తనదైన పద్ధతిలో పరిష్కరించి 1950 డిసెంబర్ 15న మరణించాడు. నాలుగు దశాబ్దాల అనంతరము 1991లో భారత ప్రభుత్వము భారతరత్న బిరుదు ఇచ్చింది.పటేల్ తొలినాళ్ల జీవితము:ఈనాటి గుజరాత్ లోని నడియాడ్ లో వ్యవసాయదారుల కుటుంబములో జువేరి భాయ్ పటేల్ లడ్బా దంపతులకు ఆరుగురు సంతానములో నాలుగవ వాడిగా వల్లబ్ భాయ్ పటేల్ జన్మించాడు. స్వరాజ్ పార్టీ వ్యవస్థాపకుడు. స్వాతంత్ర ద్యమంలో పాల్గొన్నారు. వారి స్వగ్రామం కరంసాడ్ లో గుజరాతి మధ్యమంలో ప్రాథమిక విద్యా భ్యాసము పూర్తి చేశాడు. గొప్ప వ్యక్తిగా పేరు తెచ్చుకోవాలని కోరిక చిన్ననాటి నుంచి ఉన్న వల్ల బాబాయ్ దానికి మార్గం ఇంగ్లీష్ విద్యబ్యాసమేనని నమ్మాడు. అందుకోసం తండ్రిని కోరి ఇబ్బందుల మధ్య ఆంగ్ల మధ్యమంలో చదువు ప్రారంభించి కరంసాడ్ లో మూడవ తరగతి వరకు పెట్లాడులో ఐదవ తరగతి వరకు నడియాడలో మెట్రిక్యులేషన్ వరకు చదువుకుంటున్న దశలోనే 16వ యేటా పెద్దల నిశ్చయం మేరకు 12 ఏళ్ల వయసున్న జువేర్ బాని పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి తర్వాత వల్ల బాబాయ్ స్థిరపడేదాకా ఆమె పుట్టింట్లోనే ఉండేది.మెట్రిక్యులేషన్ పూర్తయ్యేసరికి 22 ఏళ్ళ పూర్తి కావడంతో త్వరగా ప్లీడర్ కావాలన్నా ఆలోచనతో ఇంటి ఉద్దే ఉంటూ సొంతంగా చదువుకొని మూడేళ్లలోనే డిస్టిక్ ప్లీడర్స్ కోర్స్ పరీక్షకు కూర్చుని విజయం సాధించాడు.అహ్మదాబాదులో బారిష్టర్ గా వల్లభ్‌పై పటేల్ కూడా అంతకుముందు బోర్సాదు లాగానే ఎక్కువగా క్రిమినల్ కేసులు తీసుకునేవాడు.



-మంతటి నారాయణ,రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు,జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.

ర్యాగింగ్‌కు పాల్పడితే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం.. చట్టపరమైన చర్యలు తప్పవు

సీనియర్లతో పరిచయాలు పెంచుకోండి...ర్యాగింగ్‌కు భయపడకుండా స్వేచ్ఛగా విద్యను అభ్యసించండి
సీనియర్లు జూనియర్లకు మార్గదర్శకులుగా ఉండాలి.. భయపెట్టే వారిగా కాదు
జిల్లా ఎస్పీ డి.జానకి

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌కు ఏమాత్రం చోటు ఉండకూడదని, స్నేహం పేరుతో తోటి విద్యార్థులను వేధించడం, అవమానించడం, మానసికంగా లేదా శారీరకంగా ఇబ్బందులకు గురిచేయడం చట్టరీత్యా తీవ్రమైన తప్పిదమని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి అన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడే విద్యార్థులపై కళాశాల పరంగా కఠినమైన క్రమశిక్షణా చర్యలతో పాటు, నేర స్వభావాన్ని బట్టి పోలీసు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శుక్రవారం ఎస్వీఎస్ డెంటల్ కాలేజీలో మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం డెంటల్ విద్యార్థుల కోసం నిర్వహించిన యాంటీ ర్యాగింగ్ అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, చట్టపరమైన పరిణామాలు, విద్యార్థుల బాధ్యతలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి దశ అనేది జీవితంలో అత్యంత కీలకమైన సమయమని, ముఖ్యంగా వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు క్రమశిక్షణ, మానవత్వం, సేవాభావం, పరస్పర గౌరవం వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. సీనియర్ విద్యార్థులు జూనియర్లకు మార్గదర్శకులుగా నిలవాలే తప్ప, వారిని భయపెట్టడం, అవమానించడం, బలవంతంగా పనులు చేయించడం, అసభ్యకరంగా ప్రవర్తించడం, శారీరకంగా లేదా



మానసికంగా వేధించడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు.పరిచయం చేసుకోవడం, స్నేహపూర్వకంగా మాట్లాడటం, చదువులో సహకరించడం మంచి సంప్రదాయమని, అయితే వాటి పేరుతో హద్దులు దాటి ఇతరులను ఇబ్బందులకు గురిచేయడం ర్యాగింగ్ పరిధిలోకి వస్తుందని వివరించారు. ర్యాగింగ్ వల్ల బాధిత విద్యార్థుల్లో భయం, ఆత్మన్యూనతాభావం, మానసిక ఒత్తిడి ఏర్పడటమే కాకుండా వారి విద్యాభ్యాసం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడినట్లు నిర్ధారణ అయితే యాంటీ ర్యాగింగ్ నిబంధనల ప్రకారం సస్పెన్షన్, పరీక్షలకు అనర్హత, హాస్టల్ నుంచి తొలగింపు, జరిమానా, కళాశాల నుంచి బహిష్కరణ వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. అంతేకాకుండా దాడులు, బెదిరింపులు, వేధింపులు



వంటి నేరాలకు పాల్పడితే సంబంధిత చట్టాల ప్రకారం పోలీసు కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఏ విద్యార్థి అయినా ర్యాగింగ్‌కు గురైతే భయపడకుండా వెంటనే కళాశాల యాజమాన్యం, యాంటీ ర్యాగింగ్ కమిటీ లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు. ర్యాగింగ్‌ను ప్రోత్సహించడం, చూసి చూడనట్లు వ్యవహరించడం కూడా సమాజానికి, తోటి విద్యార్థులకు హానికరమని పేర్కొన్నారు. విద్యార్థులు తమ చదువుపై దృష్టి సారించి, మంచి వైద్యులుగా ఎదిగి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.ర్యాగింగ్ రహిత విద్యాసంస్థల నిర్మాణం ప్రతి ఒక్కరి బాధ్యత అని, స్నేహం, సహకారం, క్రమశిక్షణతో కూడిన వాతావరణాన్ని కల్పించడంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కె.వెంకట్ రెడ్డి, ఎస్వీఎస్ ఎడ్యుకేషన్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ మునిశేఖర్, కళాశాల ప్రిన్సిపాల్, అడ్వకేట్ రవికుమార్ యాదవ్, ఇతర అధ్యాపకులు, మొదటి మరియు రెండవ సంవత్సరం విద్యార్థులు కలిపి సుమారు 200 మంది పాల్గొన్నారు.

కొమ్ముకుంట తాండలో బీఆర్ఎస్‌కు షాక్.. కాంగ్రెస్‌లోకి 100 మంది చేరిక

రూ.2.కోట్ల 60 లక్షల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం

తాడూరు, మన ప్రజాపక్షం:
తాడూరు మండలంలోని కొమ్ముకుంట తాండలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో



గ్రామంలోని రోడ్డు సమస్యను పట్టించుకోలేదని, అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో జరగలేదని పార్టీ మారిన కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ పట్ల ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.కొమ్ముకుంట తాండ ప్రజల చిరకాల రోడ్డు సమస్య పరిష్కారానికి మరో ముందడుగు పడింది. రూ.2 కోట్ల 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులను డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ఈరోజు ప్రారంభించారు. దీంతో గ్రామ ప్రజల ఎన్నో ఏళ్ల రోడ్డు సమస్య పరిష్కారానికి మార్గం సుగమమైంది.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సర్పంచ్ రమేష్, మాజీ డిప్యూటీ సర్పంచ్ రాజు నాయక్, సోమలా నాయక్, లక్ష్మణ్ నాయక్, దీప్లా నాయక్, వార్డు సభ్యుడు మోతియా నాయక్, శంకర్ నాయక్, మంజు నాయక్



తదితరులు పాల్గొన్నారు.అలాగే యువ నాయకులు సురేష్, భానునాయక్, శివ రాథోడ్, శ్రీకాంత్, రాము, సురేష్, రాజేష్, వినోద్, మహేష్, శివ, మహేష్ బాబు, తారాసింగ్, చందర్, జగదీష్‌తో పాటు గ్రామ మహిళలు, యువత, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కోసం ఫ్లాష్ లైట్లతో వాకథాన్

ట్యాంక్ బండ్‌పై నేటి సాయంత్రం 6 గంటలకు వాకథాన్ నిర్వహణ
మొబైల్ ఫ్లాష్ లైట్లు వెలిగిస్తూ అవగాహన కార్యక్రమంలో భాగస్వాములు కావాలి
పట్టణ ప్రజలకు ఎస్పీ డి.జానకి ఆహ్వానం

మహబూబ్ నగర్, మన ప్రజాపక్షం:
మహబూబ్‌నగర్ పట్టణ ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవగాహన కల్పించి, సైబర్ మోసాల నుంచి ప్రజలను అప్రమత్తం చేయాలనే ఉద్దేశంతో మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 31వ తేదీ సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని ట్యాంక్ బండ్‌పై మొబైల్ ఫ్లాష్ లైట్లతో వాకథాన్ నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మొబైల్ ఫోన్ల ఫ్లాష్ లైట్లు వెలిగిస్తూ సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమానికి మద్దతు తెలపాలని జిల్లా ఎస్పీ డి.జానకి ఆహ్వానించారు.

ఓటీపీలు ఎవరికీ చెప్పవద్దు- అనుమానాస్పద లింకులను ఓపెన్ చేయవద్దు

సైబర్ నేరగాళ్ల మోసపూరిత కాల్స్, మెసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బ్యాంకు వివరాలు, ఓటీపీలు ఇతరులకు వెల్లడించవద్దని, గుర్తుతెలియని వ్యక్తులు పంపే అనుమానాస్పద లింకులను క్లిక్ చేయవద్దని ప్రజలకు సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.సైబర్ నేరాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, వాకథాన్ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఎస్పీ కోరారు.

బోర్లు వేయాలంటే ఎన్‌వోసీ తప్పనిసరి!

పాత బోర్లకూ అనుమతులు.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గ్రౌండ్‌వాటర్ విచ్చలవిడి వినియోగంపై ప్రభుత్వ కొరడా

వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థల్లో నీటి వినియోగానికి లెక్కలు

నీటి వినియోగాన్ని బట్టి యూజర్ ఛార్జీల వసూలు

అక్టోబర్ 30:

ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం భూగర్భ జలాల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించింది. భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడేయడాన్ని నియంత్రించడంతో పాటు నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలకు సిద్ధమైంది. ఇప్పటికే అమల్లో ఉన్న వాల్టా చట్టం, జీవో నంబర్ 15 నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఇకపై అనుమతులు లేకుండా బోర్లు తవ్వడం, భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగించడం సాధ్యం కానుంది.

ఎన్‌వోసీ తప్పనిసరి

కొత్తగా బోర్లు వేయాలనుకునే వారు భూగర్భ జల శాఖ నుంచి తప్పనిసరిగా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) పొందాలి. వ్యవసాయం, గృహ, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు, వాటర్ ప్లాంట్లు, పరిశ్రమలు, గనుల తవ్వకాలు తదితర రంగాలకు సంబంధించిన బోర్లకు ఈ నిబంధనలు వర్తిస్తాయి. నిర్ణీత రూ.10 వేల రుసుము చెల్లించి నిబంధనల ప్రకారం అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఇప్పటికే అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన బోర్లకు సంబంధించి అనుమతులు పొందాలని, గడువు ముగిసిన ఎన్‌వోసీలను పునరుద్ధరించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రిగ్గులపైనా ఆంక్షలు

బోర్‌వెల్ తవ్వకాలకు ఉపయోగించే డ్రిల్లింగ్ రిగ్గుల విషయంలోనూ ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేయనుంది. రిజిస్ట్రేషన్ కలిగిన డ్రిల్లింగ్ రిగ్గులను మాత్రమే వినియోగించాలి. అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహించే రిగ్గులను గుర్తించి సీజ్ చేసే అవకాశం ఉంది. కొత్తగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలకు అనుమతులు మంజూరు చేసే సమయంలోనూ భూగర్భ జల వినియోగానికి సంబంధించిన ఎన్‌వోసీని పరిశీలించాలని సంబంధిత శాఖలకు ప్రభుత్వం స్పష్టం చేసింది.

నీటి వినియోగానికి యూజర్ ఛార్జీలు

భూగర్భ జలాలను అధికంగా వినియోగించే పరిశ్రమలు, వాణిజ్య సంస్థలపై యూజర్ ఛార్జీలు విధించనున్నారు. ఇటుకల పరిశ్రమలు, రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంట్లు, మినరల్ వాటర్, డిస్టిల్డ్ వాటర్ ప్లాంట్లు, గోలిసోడా తయారీ కేంద్రాలు, ఐస్ తయారీ యూనిట్లు, ఐస్‌క్రీమ్ కంపెనీలు, ఆటోమొబైల్ సర్వీసింగ్ కేంద్రాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, అపార్ట్‌మెంట్లు, స్విమ్మింగ్ పూల్స్, పాఠశాలలు, కళాశాలలు, ఆస్పత్రులు తదితర సంస్థలు ఈ పరిధిలోకి వస్తాయి. నీటి వినియోగాన్ని లెక్కించేందుకు డిజిటల్ ఫ్లో మీటర్లు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది.మౌలిక వసతుల రంగానికి చెందిన సంస్థల్లో ప్రతి వెయ్యి లీటర్ల నీటి వినియోగానికి రూ.1 చొప్పున ఛార్జీలు వసూలు చేస్తున్నారు. సాధారణ పరిశ్రమలకు సంబంధించి భూగర్భ జలాల లభ్యత ఆధారంగా సురక్షిత ప్రాంతాల్లో కిలోలీటరుకు రూ.2 నుంచి రూ.10 వరకు, అధికంగా భూగర్భ జలాలు వినియోగించిన ప్రాంతాల్లో రూ.20 నుంచి రూ.100 వరకు ఛార్జీలు విధించే విధానం అమల్లో ఉంది. ఈ మేరకు భూగర్భ జల శాఖ అధికారులు సంబంధిత సంస్థలకు నోటీసులు జారీ చేస్తున్నారు.

కొన్ని వర్గాలకు మినహాయింపు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని వ్యక్తిగత గృహ వినియోగదారులు, వ్యవసాయ కార్యకలాపాలు, గ్రామీణ తాగునీటి సరఫరా పథకాలు, సాయుధ దళాల సంస్థలకు యూజర్ ఛార్జీల నుంచి మినహాయింపు ఉంది. అయితే పట్టణ



ప్రాంతాల్లోని నివాస అపార్ట్‌మెంట్లు, గ్రూప్ హౌసింగ్ సొసైటీలకు నెలవారీ మీటర్ రీడింగ్ ఆధారంగా ఛార్జీలు విధిస్తున్నారు. ఇంకుడు గుంతలు వంటి భూగర్భ జలాల పునరుద్ధరణ నిర్మాణాలు చేపట్టే సంస్థలకు యూజర్ ఛార్జీల్లో 50 శాతం రాయితీ కల్పించే వెసులుబాటు ఉంది.

హైదరాబాద్‌లో నవంబర్ 1 నుంచి ప్రత్యేక ఆంక్షలు

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తాగునీటి అవసరాలు మినహా ఇతర అవసరాలకు కొత్త బోర్లు తవ్వడంపై నవంబర్ 1 నుంచి నిషేధం అమల్లోకి రానుంది. నిర్మాణ పనులు, ఇతర అవసరాల కోసం కొత్త బోర్లకు అనుమతులు ఇవ్వకూడదని నిర్ణయించారు. ఇప్పటికే ఉన్న బోర్లను తాగునీటి అవసరాల కోసం మాత్రమే నిబంధనల ప్రకారం లోతు పెంచుకునేందుకు అనుమతి ఇచ్చే అవకాశం ఉంది.భూగర్భ జలాల పరిరక్షణ, భవిష్యత్తులో తాగునీటి కొరతను నివారించడం, నీటి వృథాను అరికట్టడం లక్ష్యంగా ప్రభుత్వం ఈ చర్యలు చేపడుతోంది. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

ఇంటర్మీడియట్ విద్యలో నూతన పరీక్షా విధానంపై అవగాహన కల్పించాలి

విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు ఆచరణాత్మక నైపుణ్యాలను పెంపొందించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ,మన ప్రజాపక్షం:

ఇంటర్మీడియట్ విద్యలో ప్రవేశపెట్టిన నూతన పరీక్షా విధానం పట్ల అధ్యాపకులు విద్యార్థులకు అవగాహన కల్పించి, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.శుక్రవారం నాడు జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా నూతన పరీక్షా విధానంపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ బోర్డు ఇంగ్లీష్ మినహా మిగతా 11 సబ్జెక్టుల సిలబస్‌లో మార్పులు చేయడంతో పాటు గణితం, హ్యూమానిటీస్, కామర్స్ సబ్జెక్టులకు అంతర్గత మూల్యాంకన విధానాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. సైన్స్ సబ్జెక్టులకు సంబంధించిన ప్రాక్టికల్ పరీక్షల విధానం కొనసాగుతుందని, మొదటి సంవత్సరం ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ సబ్జెక్టులకు కూడా ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే విధానాన్ని ప్రవేశపెట్టినట్లు డీఐఈఓ, కలెక్టర్‌కు వివరించారు.సాధారణ సబ్జెక్టుల్లో 80 మార్కులకు థియరీ పరీక్ష, 20 మార్కులకు అంతర్గత మూల్యాంకనం ఉంటుందని, మొత్తం 100 మార్కులకు కనీసం 35 శాతం మార్కులు సాధించడం ఉత్తీర్ణతకు అవసరమని వివరించారు. థియరీలో 80 మార్కులకు కనీసం 28 మార్కులు, అంతర్గత మూల్యాంకనంలో 20 మార్కులకు కనీసం 7 మార్కులు సాధించాల్సి ఉంటుందని తెలిపారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను కేవలం రాత పరీక్షల ద్వారానే కాకుండా వివిధ విద్యా కార్యకలాపాలు, ప్రాజెక్టులు, ప్రాక్టికల్ పరీక్షలు, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, స్లిప్ టెస్ట్‌లు, వైవా, తదితర అంశాల ఆధారంగా సమగ్రంగా అంచనా వేయాలని సూచించారు.అలాగే సబ్జెక్టుల వారీగా నిర్దేశించిన మార్కుల విభజన, కనీస ఉత్తీర్ణత మార్కులను అధ్యాపకులు స్పష్టంగా తెలుసుకుని విద్యార్థులకు వివరించాలన్నారు.గణితంలో యూనిట్ టెస్ట్‌లు, సమస్యల పరిష్కారం, హ్యూమానిటీస్‌లో చరిత్ర, అర్థశాస్త్రం, పౌరశాస్త్రం వంటి సబ్జెక్టులకు సంబంధించి విద్యార్థులతో వివిధ విద్యా కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు. కామర్స్, అకౌంటెన్సీ సబ్జెక్టుల్లో పాఠ్య పుస్తక ఆధారిత కార్యకలాపాలు, కేస్ స్టడీలు, నివేదికల రచన, పోస్టర్లు, చిన్న గమనికలు, ఫ్లోచార్ట్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన, విశ్లేషణ సామర్థ్యాలను అంచనా వేయాలన్నారు.ఫిజిక్స్, కెమిస్ట్రీ, బాటనీ, జువాలజీ ప్రయోగశాలల్లో అవసరమైన పరికరాలు, నమూనాలు, శిక్షణ సామగ్రి అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. ఫిజిక్స్ ల్యాబ్‌లో ట్యూనింగ్ ఫోర్కులు, కాలిపర్స్, తదితర పరికరాలు, కెమిస్ట్రీ ల్యాబ్‌లో బీకర్లు, ఇతర ప్రయోగ సామగ్రి, అగ్నిమాపక భద్రతా పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో లేదో తనిఖీ చేయాలని తెలిపారు. బాటనీ ల్యాబ్‌లో హెర్బేరియం, మైక్రోస్కోప్‌లు, జువాలజీ ల్యాబ్‌లో వివిధ నమూనాలు, శరీర నిర్మాణానికి సంబంధించిన మోడల్స్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రయోగశాలల్లో పరికరాల లభ్యత, భద్రతా ఏర్పాట్లు, నిర్వహణ స్థితిగతులను పరిశీలించి, 15 రోజుల్లోగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు.అధ్యాపకులు తాము బోధించే సబ్జెక్టులపై పూర్తి స్థాయి పరిజ్ఞానం కలిగి ఉండాలని, విద్యార్థులకు పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించడంతో పాటు వారిలో ఆచరణాత్మక అవగాహన, విశ్లేషణాత్మక ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించాలని సూచించారు. ముఖ్యంగా సైన్స్ సబ్జెక్టుల్లో ప్రయోగాల ద్వారా విద్యార్థులకు ఆసక్తి కలిగించాలని, జన్యుశాస్త్రం, డీఎన్ఏ నిర్మాణం, మెండల్ నియమాలు, మైటోకాండ్రియా, క్లోరోప్లాస్ట్, సి3, సి4 మొక్కల మధ్య వ్యత్యాసాలు వంటి అంశాలను ప్రయోగాత్మకంగా, ఆసక్తికరంగా వివరించాలని తెలిపారు.అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు సమన్వయంతో పనిచేస్తూ నూతన పరీక్షా విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారి అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేయాలని స్పష్టం చేశారు.ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యా శాఖ అధికారి జితేందర్ రెడ్డి, ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

లండన్‌లో ఉందని అనుకుంటే.. పుణే ఫ్లాట్‌లో శవమై కనిపించిన మహిళ!

లండన్‌లో ఎంబీఏ చదువుతోందని కుటుంబసభ్యులు భావిస్తుండగా, ఓ మహిళ పుణేలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అనుమానాస్పద స్థితిలో మరణించింది. ఛత్రపతి సంభాజీనగర్‌కు చెందిన ముగ్ధా దేశ్‌ముఖ్ (34) పింప్రి చించ్‌వాడ్‌లోని ఓ ఫ్లాట్‌లో శవమై కనిపించడం తీవ్ర కలకలం రేపింది. కుటుంబానికి తెలియకుండా ఆమె యూకే నుంచి రహస్యంగా తిరిగి రావడం, ఆపై మరణించడం పలు అనుమానాలకు తావిస్తోంది.వివరాల్లోకి వెళితే, ముగ్ధా దేశ్‌ముఖ్ 2025 జులైలో ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లింది. అక్కడే ఉంటూ ఎంబీఏ చదువుకుంటున్నట్లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు చేస్తున్నట్లు కుటుంబసభ్యులతో నిరంతరం ఫోన్, మెసేజ్‌ల ద్వారా మాట్లాడుతూ ఉండేది. అయితే, కుటుంబసభ్యులకు తెలియకుండా ఆమె 2026 ఆగస్టులోనే రహస్యంగా భారత్‌కు తిరిగి వచ్చింది. పుణే సమీపంలోని గహుంజే ప్రాంతంలో ఉన్న లోధా బెల్మోండో కాంప్లెక్స్‌లో గతంలో తాను అద్దెకు తీసుకున్న ఫ్లాట్‌లో ఒంటరిగా నివసించడం ప్రారంభించింది.అక్టోబర్ 23న చివరిసారిగా తల్లిదండ్రులతో మాట్లాడిన ముగ్ధా, ఓ జాబ్ ఇంటర్వ్యూ ఉందని చెప్పింది. ఆ తర్వాత రోజు నుంచి ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. లండన్‌లోని ఆమె స్నేహితురాలిని సంప్రదించగా, ముగ్ధా ఆగస్టులోనే యూకే విడిచి వెళ్లినట్లు అక్కడి పోలీసుల ద్వారా తెలిసింది. అదే సమయంలో, ఆమె ఫుడ్ డెలివరీ లావాదేవీలు భారత్‌లో జరిగినట్లు తెలియడంతో, ఆమె ఇక్కడే ఉందని నిర్ధారించుకున్న తండ్రి, ఛత్రపతి సంభాజీనగర్ పోలీసులకు కిడ్నాప్ ఫిర్యాదు చేశారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు, సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేసి ఆమె పుణే ఫ్లాట్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఫ్లాట్ వద్దకు వెళ్లి చూడగా, తలుపు లోపలి నుంచి లాక్ చేసి ఉంది. దీంతో పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోపలికి ప్రవేశించగా, అప్పటికే కుళ్లిన స్థితిలో ఉన్న ముగ్ధా మృతదేహం కనిపించింది. శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. మృతికి కచ్చితమైన కారణం తెలుసుకునేందుకు నమూనాలను పోస్ట్‌మార్టమ్‌కు పంపారు.పుణేలో ఉన్న సమయంలో ముగ్ధా ఆన్‌లైన్‌లో ఎంబీఏ విద్యార్థులకు పాఠాలు చెబుతూ జీవనం సాగిస్తోందని, ఎవరితోనూ పెద్దగా కలిసేది కాదని తెలిసింది. ఆమె యూకే నుంచి ఎందుకు రహస్యంగా తిరిగి వచ్చింది? ఆమె మరణానికి గల కారణాలు ఏంటి? అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులను తొలగించే ఆలోచనను విరమించుకోవాలి

ఉద్యోగ భద్రతకు భంగం కలిగిస్తే ఆందోళన తప్పదు. ఎం ఐ ఎం ప్రెసిడెంట్ అత్తర్ అహ్మద్ , కౌన్సిలర్ సోనీ యిర్మీయా

జహీరాబాద్, అక్టోబర్ 30,

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏళ్ల తరబడి సేవలందిస్తున్న కార్మికులను తగ్గించడం లేదా ఉద్యోగాల నుంచి తొలగించే ఆలోచనను ఆసుపత్రి యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని ఎం ఐ ఎం జహీరాబాద్ ప్రెసిడెంట్ అత్తర్ అహ్మద్,కౌన్సిలర్ సోనీ యిర్మీయా డిమాండ్ చేశారు. కార్మికుల ఉద్యోగ భద్రతకు ముప్పు వాటిల్లకుండా చూడాలని వారు కోరారు.కార్మికుల ఉద్యోగాల తొలగింపుపై నెలకొన్న ఆందోళన నేపథ్యంలో నాయకులు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను కలిసి ఈ అంశంపై చర్చించారు. కార్మికులను తగ్గించడం, తొలగించడం వంటి ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరుతూ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా కౌన్సిలర్ సోనీ యిర్మీయా మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్నో ఏళ్లుగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఉన్నపళంగా తొలగించాలని చూడటం విచారకరమన్నారు. ఏళ్ల తరబడి సేవలందించిన కార్మికులను ఉద్యోగాల నుంచి తొలగిస్తే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయి రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఉపాధిని దెబ్బతీసే నిర్ణయాలకు ఆసుపత్రి యాజమాన్యం దూరంగా ఉండాలని సూచించారు.కార్మికుల ఉద్యోగ భద్రతకు భంగం కలిగించే నిర్ణయాలను వెనక్కి తీసుకోకపోతే ఆల్ ఇండియా మజ్లిస్ ఏ ఇత్తే హాదుల్ ముస్లిమీన్ (ఏఐఎం ఐఎం)ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు అమీర్, ఇలియాస్, శరీఫ్ తదితరులు ఉన్నారు.



ప్రజా సమస్యల పరిష్కారానికి 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలి - ఎమ్మెల్యే శ్రీగణేష్

అక్టోబర్ 30, సికింద్రాబాద్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ 'వే టు న్యూస్' నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొని, ఫోన్ కాల్స్ ద్వారా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా, వాటిని సావధానంగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.